रजिस्ट्री सं डी—२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి--221

मूल्य रु 5.00 पैसे
[Price Rs. 5.00 Paise.
మూల్యము : రూ. 5.00 పైసలు

भारत का राजपत्र
The Gazette of India
భారత రాజపత్రము

असाधारण
EXTRAORDINARY
అసాధారణ

भाग XVI अनुभाग 1
Part XVI Section 1
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
PUBLISHED BY AUTHORITY
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

सं १	नई दिल्ली	सोमवार	११ मे २००९/१६ वैशखा	संण्ड १६
No. 1	New Delhi	Monday	11 May, 2009/16 Vaishakha	Vol. 16
సంఖ్య 1	న్యూఢిల్లీ	సోమవారము	11 మే, 2009/16 వైశాఖ	సంపుటము 16

MINISTRY OF LAW AND JUSTICE
(LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 23rd March, 2009/13 Phalguna, 1931 Virodhi.

The Translation in Telugu of the following Acts namely:-

(1) The Right to Information Act, 2005 (22 of 2005) and (2) The Commercial Documents Evidence Act, 1939 (30 of 1939) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Texts thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

(శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా,

(1) సమాచార హక్కు చట్టము, 2005 (2005లోని 22వ చట్టము); మరియు (2) వాణిజ్య దస్తావేజుల సాక్ష్య చట్టము, 1939 (1939లోని 30వ చట్టము)ల యొక్క తెలుగు అనువాదములను రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదములను ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

సమాచార హక్కు చట్టము, 2005

(2005 లోని 22వ చట్టము)

[2005, జూన్ 15]

సార్వజనిక ప్రాధికారముల నియంత్రణలోఉండే సమాచారమును పౌరులకు పొందే అవకాశమును, వారికి సమాచార హక్కును కల్పించుటకై వ్యవహారిక పాలనా పద్ధతిని రూపొందించుటకును, ప్రతి సార్వజనిక ప్రాధికారము యొక్క పనితీరులో పారదర్శకతను మరియు జవాబుదారీతనమును పెంపొందించుటకుగాను కేంద్ర సమాచార కమీషను మరియు దానికి సంబంధించిన లేక వాటికి అనుషంగికమైన విషయముల కొరకు నిబంధించుటకైన చట్టము.*

భారత సంవిధానము ప్రజాస్వామిక గణరాజ్యమును స్థాపించినందునను;

ప్రజాస్వామ్య మనుగడకు పౌరులకు వాస్తవాలు తెలియడం, సమాచార పారదర్శకత ప్రధానమైనందునను మరియు అవినీతిని కట్టడి చేయుటకై ప్రభుత్వములను మరియు వాటి అనుబంధ విభాగములను పాలితులకు జవాబుదారీ చేయవలసి ఉన్నందుననూ;

ప్రభుత్వముల సమర్థ నిర్వాహణ, పరిమిత ఆర్థిక వనరులకు వీలైనంత గరిష్ఠ ఉపయోగము మరియు సున్నితమైన సమాచారము యొక్క గోపనీయతను కాపాడటం వంటి ప్రజా ప్రయోజనముల విషయంలో వాస్తవముగా ఆచరణలో సమాచార వెల్లడి వలన ఆ ప్రయోజనాలకు విరుద్ధంగా మారే అవకాశము ఉన్నందుననూ;

ఆదర్శ ప్రజాస్వామ్యము యొక్క ప్రాముఖ్యతను పరిరక్షిస్తునే ఈ పరస్పర వైరుధ్యాలను తొలగించవలసిన అవసరం ఉన్నందునను;

ప్రస్తుతం, పౌరులు కోరిన నిర్థిష్ట సమాచారమును వెంటనే అందజేయుటకు ఏర్పాటు చేయవలసి ఉన్నందుననూ;

భారత గణరాజ్యపు యాభై ఆరవ సంవత్సరములో, పార్లమెంటు ఈ క్రింది విధముగా శాసనము చేసినది:-

---

* మరియు రాజ్య సమాచార కమీషన్లకు ఏర్పాటు చేయుటకు

అధ్యాయము - 1
ప్రారంభిక

సంగ్రహ నామము, విస్తరణ మరియు ప్రారంభము.

1. (1) ఈ చట్టమును సమాచారహక్కు చట్టము,2005 అని పేర్కొనవచ్చును.

(2) ఇది జమ్మూ, కాశ్మీరు రాజ్యము మినహా యావత్ భారతదేశమునకు విస్తరించును.

(3) 4వ పరిచ్ఛేదపు ఉప పరిచ్ఛేదము (1)యొక్క నిబంధనలు, 5వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదములు (1) మరియు (2), పరిచ్ఛేదములు 12, 13, 15, 16, 24, 27 మరియు 28 వెంటనే అమలులోనికి వచ్చును మరియు ఈ చట్టము యొక్క మిగతా నిబంధనలు, చట్టము చేయబడిన మీదట నూట ఇరువదియవ దినమున అమలులోనికి వచ్చును.

నిర్వచనములు.

2. ఈ చట్టములో సందర్భమునుబట్టి వేరు అర్థము ఉన్ననే తప్ప, --

(ఎ) "సముచిత ప్రభుత్వము" అనగా ఒక సార్వజనిక ప్రాధికారమునకు సంబంధించి దాని స్థాపన, సంఘటన స్వామ్యము, నియంత్రణ లేక ప్రత్యక్షముగాగాని పరోక్షముగా గాని తగిన నిధులు సమకూర్చుట వంటివి;-

(i) కేంద్ర ప్రభుత్వముచే లేక సంఘ రాజ్యక్షేత్రముచే జరిగినపుడు, కేంద్ర ప్రభుత్వము;

(ii) రాజ్య ప్రభుత్వముచే జరిగినపుడు, రాజ్య ప్రభుత్వము అని అర్థము;

(బి) "కేంద్ర సమాచార కమీషను" అనగా 12వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద సంఘటితము చేయబడిన కేంద్ర సమాచార కమీషను అని అర్థము;

(సి) "కేంద్ర పౌర సమాచార అధికారి" అనగా 5వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (1)క్రింద నియోగించబడిన కేంద్ర పౌర సమాచార అధికారి అని అర్థము మరియు ఇందులో ఉప-పరిచ్ఛేదము (2) క్రింద అట్లు నియోగించబడిన కేంద్ర సహాయ పౌర సమాచార అధికారి చేరివుండును;

(డి) "ప్రధాన సమాచార కమీషనరు" మరియు "సమాచార కమీషనరు" అనగా 12వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3)క్రింద నియమించబడిన ముఖ్య సమాచార కమీషనరు మరియు సమాచార కమీషనరు అని అర్థము;

(ఇ) "సమర్థ ప్రాధికారి" అనగా, --

(i) లోకసభ లేక రాజ్యాశాసనసభ లేక అట్టి శాసనసభను కలిగియున్న సంఘ రాజ్య క్షేత్రము విషయములో స్పీకరు మరియు రాజ్యసభ లేక రాజ్య శాసన పరిషత్తు విషయములో ఛైర్మను;

(ii) సర్వోన్నత న్యాయస్థానము విషయములో భారతప్రధాన న్యాయమూర్తి;

(iii) ఉన్నత న్యాయస్థానము విషయములో ఉన్నత న్యాయస్థానము యొక్క ప్రధాన న్యాయమూర్తి;

(iv) సంవిధానము ద్వారా లేక దాని క్రింద స్థాపించబడిన లేక సంఘటితము చేయబడిన ఇతర ప్రాధికారముల విషయములో రాష్ట్రపతి లేక సందర్భ-మును బట్టి గవర్నరు;

(V) సంవిధానము యొక్క 239వ అనుచ్ఛేదము క్రింద నియమింపబడిన పరిపాలకుడు;

అని అర్థము;

(ఎఫ్) "సమాచారము" అనగా, రికార్డులు, దస్తావేజులు, మెమోలు/ ఇ-మెయిళ్లు, అభిప్రాయములు, సలహాలు, పత్రికా ప్రకటనలు, సర్క్యులర్లు/ఉత్తరువులు, లాగ్ పుస్తక-ములు, కాంట్రాక్టులు, నివేదికలు, పేపర్లు, మచ్చులు, నమూనాలు, ఏదేని ఎలక్ట్రానిక్ ప్రరూపములో నిల్వచేసిన విషయవస్తువు డేటా మరియు తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతరశాసనము క్రింద సార్వజనికప్రాధికారము ద్వారా పొందదగిన ఏదేని ప్రైవేటు నికాయమునకు సంబంధించిన సమాచారముతో సహా ఏదేని ప్రరూపములోని ఏదేని విషయవస్తువు అని అర్థము;

(జి) "విహిత" అనగా సముచిత ప్రభుత్వముచే లేదా సందర్భానుసారముగా సమర్థ ప్రాధికారిచే ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా విహితపరచిన అని అర్థము;

(హెచ్) "సార్వజనిక ప్రాధికారము" అనగా, --

(ఎ) సంవిధానము ద్వారా లేక దాని క్రింద;

(బి) పార్లమెంటుచే చేయబడిన ఏదేని ఇతర శాసనము ద్వారా;

(సి) రాజ్య శాసనమండలిచే చేయబడిన ఏదేని ఇతర శాసనము ద్వారా;

(డి) సముచిత ప్రభుత్వముచే జారీ చేయబడిన అధిసూచన లేక చేయబడిన ఉత్తరువు ద్వారా

స్థాపించబడిన లేక సంఘటితము చేయబడిన ఏదేని సార్వజనిక ప్రాధికారము లేక నికాయము లేక స్వయం పాలక సంస్థ అని అర్థము; మరియు ఇందులో సముచిత ప్రభుత్వముచే --

(i) స్వామ్యము కలిగి, నియంత్రించబడు లేక తగినంత నిధులు సమకూర్చబడు ఏదేని నికాయము;

(ii) ప్రత్యక్షముగాగాని లేక పరోక్షముగా గాని తగినంత నిధులు సమకూర్చబడు ఏదేని ప్రభుత్వేతర సంస్థ.

చేరివుండును;

(ఐ) "రికార్డు" అనుపదములో ఈ క్రిందివి చేరియుండును;

(ఎ) ఏదేని దస్తావేజు, వ్రాతప్రతి మరియు ఫైలు;

(బి) ఒక దస్తావేజు యొక్క ఏదేని మైక్రోఫిల్ము, మైక్రోఫిచ్ఛి మరియు ఫాసిమెయిల్ ప్రతి;

(సి) అట్టి మైక్రోఫిల్ములో (అతి పెద్దదిగా చేయబడి ఉన్నప్పటికీ, లేనప్పటికీ) ఉన్న ఏవేని ప్రతిబింబము లేదా ప్రతిబింబముల పునర్ ఉత్పత్తి; మరియు

(డి) కంప్యూటరు ద్వారా లేదా ఏదేని ఇతర పరికరము ద్వారా ఉత్పత్తి చేయబడిన ఏదేని ఇతర విషయ వస్తువు;

(జె) "సమాచార హక్కు" అనగా ఏదేని సార్వజనిక ప్రాధికారమువద్ద ఉన్న లేక దాని నియంత్రణ క్రింద ఉన్న సమాచారమును ఈ చట్టము క్రింద పొందుటకు గల సమాచార హక్కు అని అర్థము మరియు ఇందులో, -

(i) పనిని, దస్తావేజులను, రికార్డులను తనిఖీచేయుటకు;

(ii) గమనికలను, ఉదాహృతులను లేక దస్తావేజుల ధృవీకృత ప్రతులను లేక రికార్డులను తీసుకొనుటకు;

(iii) విషయ వస్తువు యొక్క ధృవీకృత నమూనాలను తీసుకొనుటకు;

(iv) అట్టి సమాచారము కంప్యూటరులో గాని లేదా ఏదేని ఇతర పరికరములో గాని నిల్వచేసి ఉన్నప్పుడు వాటిని డిస్కుల, ఫ్లాపీల, టేపుల,వీడియో క్యాసెట్టుల ప్రరూపములో లేక ఏదేని ఇతర ఎలక్ట్రానిక్ పద్ధతిలో లేదా ప్రింటౌట్లను తీసుకొనుట ద్వారా

సమాచారమును పొందుటకుగల హక్కు చేరివుండును;

(కె) "రాజ్య సమాచార కమీషను" అనగా 15వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (1) క్రింద సంఘటితము చేయబడిన రాజ్య సమాచార కమీషను అని అర్థము;

(ఎల్) "రాజ్య ముఖ్య సమచార కమీషనరు" మరియు "రాజ్య సమాచార కమీషనరు" అనగా 15వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము(3) క్రింద నియమించ-బడిన రాజ్య ముఖ్య సమాచార కమీషనరు మరియు రాజ్య సమాచార కమీషనరు అని అర్థము;

(ఎమ్) "రాజ్య పౌర సమాచార అధికారి"అనగా ఉప-పరిచ్ఛేదము(1) క్రింద నియోగించబడిన రాజ్య పౌర సమాచార అధికారి అని అర్థము మరియు ఇందులో 5వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము(2) క్రింద అట్లు నియోగించబడిన రాజ్య సహాయ పౌర సమాచార అధికారి చేరియుండును;

(ఎన్) "మూడవ పక్షకారు" అనగా సమాచారము కొరకై అభ్యర్థన చేయుచున్న పౌరుడు కానట్టి ఎవరేని ఇతర వ్యక్తి అని అర్థము; మరియు ఇందులో సార్వజనిక ప్రాధికారము చేరియుండును;

అధ్యాయము - 2
సమాచార హక్కు మరియు సార్వజనిక ప్రాధికారముల బాధ్యతలు

సమాచార హక్కు.

3. ఈ చట్టము యొక్క నిబంధనలకు లోబడి పౌరులందరు సమాచార హక్కును కలిగివుందురు.

సార్వజనిక ప్రాధికారము యొక్క బాధ్యతలు.

4. (1) ప్రతి సార్వజనిక ప్రాధికారము, --

(ఎ) ఈ చట్టము క్రింది సమాచారహక్కును వినియోగించుటకు వీలైన రీతిలో మరియు ప్రరూపములో తన రికార్డులన్నింటిని తగువిధమైన కేటలాగులు మరియు సూచీల ద్వారా నిర్వహించవలెను మరియు కంప్యూటరీకరణకు వీలైన రికార్డులన్నింటిని సముచితమైన సమయము లోపల మరియు వనరుల లభ్యతకు లోబడి, అట్టి రికార్డులను కంప్యూటరీకరించి వాటిని దేశమంతటా భిన్నమైన పద్ధతులలో పొందుటకు వీలుగా నెట్ వర్కుకు జోడించవలెను.

(బి) ఈ చట్టము అనుశాసనము చేయబడిన తేదీ నుండి నూట ఇరువది దినముల లోపల, --

(i) తమ వ్యవస్థ యొక్క కృత్యములు మరియు కర్తవ్యముల వివరములను;

(ii) తమ అధికారుల మరియు ఉద్యోగుల అధికారములు మరియు కర్తవ్యములను;

(iii) పర్యవేక్షణ మరియు జవాబుదారీతనము కొరకై ఏర్పరచుకొన్న మార్గములతో సహా నిర్ణయములు తీసుకొనుట కొరకై అనుసరించవలసిన ప్రక్రియను;

(iv) తమ కృత్యములను నిర్వహించుటకు అది ఏర్పరచుకొన్న ప్రమాణములను;

(v) తమ ఆధీనములో లేక తమ నియంత్రణ క్రింద ఉన్నట్టి లేక తమ కృత్యములను నిర్వహించుటలో దాని ఉద్యోగులు వినియోగించు నియమములు, వినియమములు, అనుదేశములు, మ్యానువల్లు మరియు రికార్డులను;

(vi) తమ అధీనములో లేక తన నియంత్రణ క్రింద ఉన్న దస్తావేజుల యొక్క కేటగిరీల వివరణను;

(vii) తమ విధాన రూపకల్పనకు లేక దాని అమలుకు సంబంధించి ప్రజలతో సంప్రదింపుల కొరకు ఉన్న ఏదేని ఏర్పాటును గురించిన వివరములను;

(viii) తనలో ఒక భాగంగా లేక తమకు సలహాలిచ్చుట కొరకు సంఘటితము చేయబడిన ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ వ్యక్తులతో కూడియున్న మండళ్లు, పరిషత్తులు, కమిటీలు మరియు ఇతర నికాయములను గూర్చిన మరియు ఆయా మండళ్లు, పరిషత్తులు, కమిటీల మరియు ఇతర నికాయముల సమావేశములకు ప్రజలు హాజరు కావచ్చునా లేక అట్టి సమావేశముల వివరణలను ప్రజలు పొందవచ్చునా అను విషయమును గూర్చిన వివరణను;

(ix) తమ అధికారులు మరియు ఉద్యోగుల యొక్క సమాచార డైరెక్టరీని;

(x) తమ వినియమములలో నిబంధించిన నష్టపరిహార పద్ధతితోసహా తన అధికారులు మరియు ఉద్యోగులచే స్వీకరించబడు నెలవారీ ప్రతిఫలమును;

(xi) అన్ని ప్రణాళికల వివరములు, ప్రతిపాదిత వ్యయముల మరియు చేసిన చెల్లింపులపై నివేదికలను సూచించుచూ తమ ప్రతియొక ఏజెన్సీకి కేటాయించిన బడ్జెటును;

(xii) అట్టి కార్యక్రమమునకు కేటాయించిన మొత్తములు మరియు లబ్దిదారుల వివరములతో సహా సబ్సిడీ పథకములు అమలు చేయవలసిన రీతిని;

(xiii) రాయితీల స్వీకర్తల వివరములను మరియు దానిచే మంజూరు చేయబడిన అనుమతులు లేక ప్రాధికారములను;

(xiv) తమ వద్ద లభ్యమగు లేక ఆధీనములో ఉన్న ఎలక్ట్రానిక్ ప్రరూపములో మార్చిన సమాచారమునకు సంబంధించిన వివరములను;

(xv) ప్రజల వినియోగము కొరకు గ్రంధాలయము లేక పఠనాలయం నిర్వహించ-బడుచున్నచో అవి పనిచేయు వేళలతో సహా సమాచారమును పొందుటకు పౌరులకు లభ్యమగు సౌకర్యముల వివరములను;

(xvi) పౌర సమాచార అధికారుల పేర్లు, హోదాలు మరియు ఇతర వివరములను;

(xvii) విహితపరచబడునట్టి ఇతర సమాచారమును;

ప్రచురించవలెను మరియు ఆ తరువాత ప్రతి సంవత్సరము ఈ ప్రచురణలను అప్ డేట్ చేయవలెను;

(సి) ముఖ్యమైన విధానములను రూపొందించునపుడు లేక ప్రజలపై ప్రభావము చూపునట్టి నిర్ణయములను ప్రకటించునపుడు సంబంధించిన అన్ని సంగతులను ప్రచురించవలెను;

(డి) తమ పరిపాలనాపరమైన లేక న్యాయిక సదృశమైన నిర్ణయముల వలన ప్రభావితులైన వ్యక్తులకు ఆ నిర్ణయములకు గల కారణములను తెలియజేయవలెను;

(2) ప్రజలు, సమాచారమును పొందుటకు ఈ చట్టమును వీలైనంత తక్కువగా ఆశ్రయించు విధముగా ఇంటర్‌నెట్‌తో సహా వివిధ ప్రసార మాధ్యమముల ద్వారా నియమిత అంతరావధులలో తమంత తాముగా సాధ్యమైనంత ఎక్కువ సమాచారమును అందజేయుటకు ఉప-పరిచ్ఛేదము (1)యొక్క ఖండము (బి)లో సూచించిన విధంగా చర్యలు తీసుకొనుటకు ప్రతియొక సార్వజనిక ప్రాధికారము నిరంతరం కృషి చేయవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము(1) యొక్క ప్రయోజనముల నిమిత్తము, ప్రతి సమాచారమును ప్రజలకు సులభంగా లభ్యమైనట్టి రూపంలో మరియు రీతిలో విరివిగా వ్యాపింపచేయవలెను.

(4) సమాచారాన్ని అందించడానికి అయ్యే ఖర్చు స్థానికంగా వాడుకలో ఉన్న భాష మరియు సమాచార వ్యాప్తికి స్థానికంగా బాగా ఉపకరించే పద్ధతులను పరిగణనలోనికి తీసుకొని వాటి ద్వారా విషయ వస్తువులన్నింటిని వ్యాపింపచేయవలెను. మరియు సమాచారమును సాధ్యమైనంత మేరకు ఎలక్ట్రానిక్ రూపములో కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగా రాజ్య పౌర సమాచార అధికారి వద్ద ఉచితముగా గాని లేదా ప్రచార మాధ్యమమునకైనట్టి ఖర్చు లేక ముద్రణ ఖర్చుకొరకు నిర్ణయించునట్టి రుసుము చెల్లింపుపై సులభంగా పొందుటకు వీలుగా అందుబాటులో ఉంచవలెను.

విశదీకరణ:- ఉప-పరిచ్ఛేదములు (3) మరియు (4) యొక్క ప్రయోజనముల నిమిత్తము "వ్యాపింపచేయుట" అనగా ఏదేని సార్వజనిక ప్రాధికారము యొక్క కార్యాలయములను తనిఖీ చేయుటతో సహా, నోటీసు బోర్డులు, వార్తాపత్రికలు, బహిరంగ ప్రకటనలు, ప్రసారణ మాధ్యమములు, ఇంటర్‌నెట్ లేక ఏదేని ఇతర సాధనముల ద్వారా ప్రజలకు తెలియజేయుట లేక సమాచారమందించుట అని అర్థము.

పౌర సమాచార అధికారుల హోదా.

5.(1) ప్రతియొక సార్వజనిక ప్రాధికారము, ఈ చట్టము అనుశాసనము చేయబడిన ఒక వంద దినముల లోపల, తమ అధీనములోని పరిపాలక యూనిట్లలో లేక కార్యాలయములలో ఈ చట్టము క్రింద సమాచారము కోరు వ్యక్తులకు సమాచారమును అందించుటకు అవసరమైనంత మంది అధికారులను, కేంద్రపౌర సమాచార అధికారులు లేదా రాజ్య పౌర సమాచార అధికారులుగా నియోగించవలెను.

(2) ఉప పరిచ్ఛేదము (1) యొక్క నిబంధనలకు భంగము కలుగకుండ ప్రతియొక సార్వజనిక ప్రాధికారము ఈ చట్టము అనుశాసనముచేయబడిన ఒక వంద దినముల లోపల ఈ చట్టము క్రింద సమాచారము కొరకైన దరఖాస్తులను లేక అపీళ్లను స్వీకరించి వాటిని వెంటనే 19వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నిర్దిష్టపరచిన కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాజ్య పౌర సమాచార అధికారి లేక సీనియర్ అధికారికి లేక కేంద్ర సమాచార కమీషనుకు లేక సందర్భానుసారముగా రాజ్య సమాచార కమీషనుకు పంపుట కొరకు ప్రతియొక సబ్-డివిజనలు స్థాయిలో లేక ఇతర సబ్ జిల్లా స్థాయిలో అధికారినొకరిని కేంద్ర సహాయ పౌర సమాచార అధికారిగా లేక సందర్భానుసారముగ రాజ్య సహాయ పౌర సమాచార అధికారిగా నియోగించవలెను;

అయితే, సమాచారము కొరకైన దరఖాస్తు లేక అపీలును, కేంద్ర సహాయ పౌర సమాచార అధికారికి లేక సందర్భానుసారముగా రాజ్య సహాయ పౌర సమాచార అధికారికి ఇచ్చిన యెడల, 7వ పరిచ్ఛేదము (1) క్రింద ప్రతిస్పందన కొరకు నిర్దిష్టపరచిన గడువును లెక్కించుటలో, ఐదు దినముల కాలావధిని చేర్చవలెను.

(3) ప్రతియొక కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగ రాజ్య పౌర సమాచార అధికారి, సమాచారమును కోరుచున్న వ్యక్తుల నుండి అందిన అభ్యర్థనలను పరిశీలించి అట్టి సమాచారమును కోరుచున్న వ్యక్తులను తగిన సహాయమును అందజేయవలెను.

(4) కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగ రాజ్యపౌర సమాచార అధికారి, అతని లేక ఆమె యొక్క కర్తవ్యములను సక్రమముగా నిర్వహించుటకు అతడు లేక ఆమె అవసరమని భావించినయెడల ఎవరేని ఇతర అధికారి యొక్క సహాయమును కోరవచ్చును.

(5) ఉప-పరిచ్ఛేదము(4) క్రింద ఏ అధికారి సహాయము కోరబడినదో ఆ అధికారి కేంద్ర పౌర సమాచార అధికారికి లేక రాజ్య పౌర సమాచార అధికారికి అన్ని విధముల సహాయమును అందించవలెను మరియు ఈ చట్టము యొక్క ఏదేని నిబంధనల ఉల్లంఘింపునకు సంబంధించి సదరు ఇతర అధికారిని కేంద్ర పౌర సమాచార అధికారి లేదా సందర్భానుసారముగ రాజ్య పౌర సమాచార అధికారిగా పరిగణించవలెను.

సమాచారము పొందుటకు అభ్యర్థన.

6.(1) ఈ చట్టము క్రింద ఏదేని సమాచారమును పొందగోరు వ్యక్తి, ఇంగ్లీషు లేదా హిందీలో లేదా దరఖాస్తు చేయబడుచున్నట్టి ప్రాంతములోని అధికారిక భాషలో వ్రాత పూర్వకముగా గాని లేక ఎలక్ట్రానిక్ సాధనము ద్వారా గాని అతనిచే లేక ఆమెచే కోరబడిన సమాచార వివరములను నిర్దిష్టపరచుచూ విహితపరచబడునట్టి ఫీజును జతచేసిన తన అభ్యర్థనను,-

(ఎ) సంబంధిత సార్వజనిక ప్రాధికారము యొక్క కేంద్ర పౌర సమాచార అధికారికి లేక సందర్భానుసారముగ రాజ్య పౌర సమాచార అధికారికి;

(బి) కేంద్ర సహాయ పౌర సమాచార అధికారికి లేక రాజ్య సహాయ పౌర సమాచార అధికారికి

పంపవలెను:

అయితే, వ్రాతపూర్వకముగా అట్టి అభ్యర్థన చేయుట సాధ్యంకానియెడల, కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగ రాజ్య పౌర సమాచార అధికారి, మౌఖికంగా సమాచారము కోరుచున్న వ్యక్తి అభ్యర్థనను వ్రాతమూలకంగా మార్చుటకు అవసరమైన సముచిత సహాయమంతటిని అందించవలెను.

(2) సమాచారము కొరకు అభ్యర్థన చేయుచున్న దరఖాస్తుదారుడిని అతడిని సంప్రదించుట కొరకు అవసరమైన వివరములు తప్ప, సమాచారమును అభ్యర్థించుటకు గల ఏదేని కారణమును తెలుపవలసినదని లేక ఏవేని ఇతర వ్యక్తిగత వివరములు ఈయవలసినదిగా కోరరాదు.

(3) సమాచారము కొరకు అభ్యర్థించుచూ సార్వజనిక ప్రాధికారముకు ఇచ్చిన దరఖాస్తులో కోరిన సమాచారం:-

(i) ఇతర సార్వజనిక ప్రాధికారము ఆధీనములో ఉన్నయెడల; లేక

(ii) సమాచారము యొక్క విషయ వస్తువు ఇతర ప్రాధికారము యొక్క కృత్యములతో దగ్గరగా సంబంధము కలిగియున్నయెడల;

అట్టి దరఖాస్తును స్వీకరించిన సార్వజనిక ప్రాధికారము, దరఖాస్తును లేక దాని యొక్క సముచితమైనట్టి భాగమును ఆ ఇతర సార్వజనిక ప్రాధికారముకు బదిలీ చేయవలెను మరియు అట్టి బదిలీని గురించిన సమాచారమును వెంటనే దరఖాస్తుదారుడికి తెలియ జేయవలెను;

అయితే, ఈ ఉప-పరిచ్ఛేదము ప్రకారం దరఖాస్తుబదిలీని వీలైనంత త్వరగా చేయవలెను, ఎట్టి సందర్భములోను దరఖాస్తు అందిన తేదీ నుండి ఐదు దినముల తరువాత చేయరాదు.

అభ్యర్థన పరిష్కారము.

7.(1) 5వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (2)కు గల వినాయింపు లేక 6వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (3)కు గల వినాయింపుకు లోబడి కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగ రాజ్య పౌర సమాచార అధికారి, 6వ పరిచ్ఛేదము క్రింద అభ్యర్థన అందిన మీదట, సాధ్యమైనంత త్వరగా మరియు ఎట్టి

సంధర్భములోనూ అభ్యర్థన అందిన తేదీ నుండి ముప్పది దినముల లోపల విహితపరచ బడునట్టి ఫీజును చెల్లించినమీదట సమాచారమును అందజేయవలెను లేదా 8వ మరియు 9వ పరిచ్ఛేదములలో నిర్ధిష్టపరచిన కారణములపై అభ్యర్థనను తిరస్కరించవలెను:

అయితే, కోరబడిన సమాచారము ఒక వ్యక్తి యొక్క ప్రాణమునకు లేక స్వేచ్ఛకు సంబంధించినదైనయెడల, దానిని అభ్యర్థన అందిన నలభై ఎనిమిది గంటల లోపల అందజేయవలెను.

(2) కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగ రాజ్య పౌర సమాచార అధికారి, ఉప-పరిచ్ఛేదము(1) క్రింద నిర్ధిష్టపరచిన గడువు లోపల సమాచారము కొరకైన అభ్యర్థనపై నిర్ణయం తీసుకొనలేకపోయినపుడు, కేంద్ర పౌరసమాచార అధికారి లేక సందర్భానుసారముగ రాజ్య పౌర సమాచార అధికారి ఆ అభ్యర్థనను తిరస్కరించినట్లుగా భావించవలెను.

(3) సమాచారమును అందజేయుటకు అయ్యే ఖర్చుకుగాను అదనపు ఫీజు చెల్లింపుపై సమాచారమును అందజేయాలని నిర్ణయము తీసుకొనినయెడల, కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగ రాజ్య పౌరసమాచార అధికారి;

(ఎ) ఉపపరిచ్ఛేదము (1)క్రింద విహితపరచబడిన ఫీజు ప్రకారము లెక్కకట్టిన మొత్తముతోపాటు సమాచారమును అందజేయుటకు అయ్యే ఖర్చుకుగాను అతడిచే నిర్ధారించబడిన అదనపు ఫీజు వివరములను తెలియజేస్తూ అభ్యర్థన చేయుచున్న వ్యక్తికి సదరు ఫీజును డిపాజిటు చేయవలసినదిగా అభ్యర్థించుచూ సందేశమును పంపవలెను మరియు సదరు సందేశమును పంపిన తేదీకి ఆ ఫీజు చెల్లింపు తేదీకి మధ్యగల కాలావధిని ఆ ఉప-పరిచ్ఛేదములో పేర్కొనిన ముప్పది దినముల గడువు నుండి మినహాయించ వలెను.

(బి) అప్పిలేటు ప్రాధికారి యొక్క వివరములు, గడువు పరిమితి, ప్రక్రియ మరియు ఏవేని ఇతర ప్రరూపములతోపాటు విధించిన ఫీజు మొత్తము లేక సమాచారం అందించే విధానంపై నిర్ణయమును పునర్ విలోకనముకోరే అతని లేక ఆమె హక్కుకు సంబంధించిన సమాచారమును, ఇచ్చుచూ అభ్యర్థన చేయుచున్న వ్యక్తికి సందేశమును పంపవలెను.

(4) ఈ చట్టము క్రింద రికార్డును లేక అందలి ఏదేని భాగమును పరిశీలించుటకు అవకాశమును ఈయవలసి ఉన్నయెడల, ఏ వ్యక్తికి అట్టి అవకాశము ఈయబడినదో ఆ వ్యక్తి శారీరకంగా అంగవైకల్యముగలవాడు అయినచో, కేంద్ర పౌర సమాచార అధికారి లేక

సందర్భానుసారముగ రాజ్య పౌర సమాచార అధికారి, ఆ వ్యక్తికి తనిఖీ కొరకు సముచిత-మైనట్టి సహాయమును అందజేయుటతోపాటు సమాచారమును పొందుటకు వీలైన సహాయమును అందజేయవలెను.

(5) సమాచారమును ముద్రణ లేక ఏదేని ఎలక్ట్రానిక్ రూపములో అందజేయవలసి ఉన్నయెడల, దరఖాస్తుదారుడు, ఉప-పరిచ్ఛేదము (6)యొక్క నిబంధనలకు లోబడి విహితపరచబడునట్టి ఫీజును చెల్లించవలెను:

అయితే, 6వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము(1) మరియు 7వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదములు (1) మరియు (5) లలో విహితపరచిన ఫీజు సబబుగా ఉండవలెను మరియు సముచిత ప్రభుత్వముచే నిర్ధారించబడునట్లుగా దారిద్య్రరేఖకు దిగువన ఉన్న వ్యక్తుల నుండి అట్టి ఫీజు ఏదియు వసూలు చేయరాదు.

(6) ఉప-పరిచ్ఛేదము (5)లో ఏమిఉన్నప్పటికినీ, సార్వజనిక ప్రాధికారము ఉప-పరిచ్ఛేదము (1)లో నిర్దిష్టపరచిన గడువు పరిమితులను పాటించుటలో విఫలమైన యెడల సమాచారమును అభ్యర్థించుచున్న వ్యక్తికి, సమాచారమును ఉచితముగా అందజేయవలెను.

(7) ఉప-పరిచ్ఛేదము (1)క్రింద ఏదేని నిర్ణయము తీసుకొనుటకు ముందు, కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగ రాజ్య పౌర సమాచార అధికారి 11వ పరిచ్ఛేదము క్రింద మూడవ పక్షకారునిచే చేయబడిన విన్నపమును పర్యాలోచించవలెను.

(8) ఉప-పరిచ్ఛేదము (1)క్రింద అభ్యర్థన తిరస్కరించబడిన యెడల,కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగ రాజ్య పౌరసమాచార అధికారి, అభ్యర్థన చేయుచున్న వ్యక్తికి;-

(i) అట్టి తిరస్కరణకుగల కారణములను;

(ii) అట్టి తిరస్కరణపై అపీలును ఎంత కాలావధి లోపల చేయవచ్చునో ఆ కాలావధిని; మరియు

(iii) అపీలు ప్రాధికారి యొక్క వివరములను;

తెలియజేయవలెను.

(9) కోరిన సమాచారం ఇవ్వడానికి ఆ సార్వజనిక ప్రాధికారము యొక్క వనరులను విపరీతంగా మళ్లించవలసివస్తే లేదా కోరబడిన రికార్డు భద్రతకు లేదా సంరక్షణకు హానికరమయితే తప్ప, సాధారణముగా కోరిన సమాచారమును కోరిన రీతిలోనే సమకూర్చవలెను.

F-4

సమాచారమును వెల్లడి చేయుటపై మినహాయింపు.

8.(1) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికిని, ఏ పౌరునికి ఈ క్రింది సమాచారమును ఈయవలసిన అవసరము లేదు;-

(ఎ) భారతదేశ సార్వభౌమత్వమునకు, అఖండతకు, రాజ్య భద్రతకు కీలకమైన వైజ్ఞానిక లేదా ఆర్థికహితములకు, విదేశములతో సంబంధములపై ప్రతికూల ప్రభావం చూపించే సమాచారం లేక ఒక అపరాధము చేయుటకు ప్రోత్సహించే సమాచారము;

(బి) ఏదేని న్యాయస్థానము లేక ట్రిబ్యునలు అభివ్యక్తముగా ప్రచురించుటను నిషేధించిన సమాచారము లేక న్యాయస్థాన ధిక్కారమునకు గురియగు సమాచారము;

(సి) పార్లమెంటు లేక రాజ్య శాసనమండలి వెల్లడిచేయు విశేషాధికారమునకు భంగము కలిగించు సమాచారము;

(డి) విస్తార ప్రజాహితము దృష్ట్యా అట్టి సమాచారమును వెల్లడిచేయుట అవసరమని సమర్థప్రాధికారి భావించిననే తప్ప, వాణిజ్యపరమైన గోప్యత, వ్యాపార రహస్యాలు, మేథోసంపత్తికి సంబంధించిన సమాచారము; మూడో వ్యక్తి పోటీచేయదగిన స్థితిని దెబ్బతీసే సమాచారం;

(ఇ) విస్తార ప్రజాహితము దృష్ట్యా అట్టి సమాచారమును వెల్లడిచేయుట అవసరమని సమర్థప్రాధికారి భావించిననేతప్ప, విశ్వాసబద్ధమైన సంబంధము రీత్యా ఒక వ్యక్తికి తెలిసియున్న సమాచారము;

(ఎఫ్) విదేశీప్రభుత్వము నుండి విశ్వసనీయముగా పొందిన సమాచారము;

(జి) ఎవరేని వ్యక్తి యొక్క ప్రాణమునకు లేక శారీరక భద్రతకు హానికలిగించే సమాచారం లేక చట్టాన్ని అమలుచేయటం కొరకు, భద్రతా అవసరాల కొరకు గోప్యంగా సమాచారం అందించిన లేక సహాయపడిన వారి గుర్తింపుకు దారి తీసే సమాచారం.

(హెచ్) దర్యాప్తు ప్రక్రియకు లేక నేరస్తులను అదుపులోకి తెచ్చు లేక అభియోగము జరుపు ప్రక్రియకు అవరోధము కలిగించు సమాచారము;

(ఐ) మంత్రి పరిషత్తు కార్యదర్శులు మరియు ఇతర అధికారుల మధ్య జరిగిన చర్చల యొక్క రికార్డులతో సహా క్యాబినెటు పత్రములు;

అయితే, మంత్రిపరిషత్తు నిర్ణయాలు, దానికి సంబంధించిన కాగితాలు మరియు ఆ నిర్ణయాలు తీసుకొనుటకు ఆధారమైన పత్రములను నిర్ణయాలు తీసుకొన్న పిమ్మట మరియు ఆ విషయము పూర్తి అయిన లేక ముగిసిన తరువాత ప్రజలకు తెలియపరచవలెను;

అంతేకాక, ఈ పరిచ్ఛేదములో నిర్దిష్టపరచిన మినహాయింపుల క్రిందికి వచ్చు విషయములను వెల్లడి చేయరాదు;

(జె) క్రేంద్ర పౌర సమాచార అధికారి లేక రాజ్య పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారము అప్పిలేటు ప్రాధికారి అట్టి సమాచారమును వెల్లడి చేయుట విస్తార ప్రజాహితము దృష్ట్యా న్యాయోచితమైనదని భావించిననే తప్ప, ప్రజా కార్యకలాపాలు, ప్రజాప్రయోజనాలతో నిమిత్తంలేని వ్యక్తిగత సమాచారం లేదా వ్యక్తుల వ్యక్తిగత జీవితంలోకి తొంగిచూసే అవాంఛనీయ ఆక్రమణము కల్పించే సమాచారం;

అయితే, పార్లమెంటుకు లేక రాజ్య శాసనమండలికి నిరాకరించుటకు వీలులేని సమాచారమును, ఎవరేని వ్యక్తికి నిరాకరించరాదు.

1923లోని 19వది.

(2) అధికారిక రహస్యాల చట్టము, 1923లో గాని లేక ఉపపరిచ్ఛేదము (1) ప్రకారము అనుమతించదగు ఏవేని మినహాయింపులలోగాని ఏమి ఉన్నప్పటికిని, సమాచారమును వెల్లడిచేయుటలో రక్షిత ప్రయోజనములకు జరుగు నష్టము కన్నా ప్రజా ప్రయోజనములకు కలుగు మేలు ఎక్కువని సార్వజనిక ప్రాధికారము భావిస్తే ఆ సమాచారమును పొందుటకు అనుమతించవచ్చును.

(3) ఉప పరిచ్ఛేదము (1)యొక్క ఖండములు (ఎ), (సి) మరియు (ఐ)లోని నిబంధనలకు లోబడి, ౬వ పరిచ్ఛేదము క్రింద ఏదేని అభ్యర్థన చేయబడిన తేదీకి ఇరవై సంవత్సరములకు ముందు జరిగిన, తటస్థించిన, సంభవించిన ఏదేని సంఘటన లేక సందర్భము లేదా విషయమునకు సంబంధించిన ఏదేని సమాచారమును ఆ పరిచ్ఛేదము క్రింద అభ్యర్థన చేసిన ఎవరేని వ్యక్తికి అందజేయవలెను:

అయితే, ఏ తేదీ నుండి సదరు ఇరవై సంవత్సరముల కాలావధిని లెక్కించవలెననుటకు సంబంధించిన ఏదేని ప్రశ్న ఉత్పన్నమైనచో, ఈ చట్టములో నిబంధించబడిన సాధారణ అప్పీళ్లకులోబడి కేంద్రప్రభుత్వము చేయు నిర్ణయము అంతిమమైనదై ఉండును.

కొన్ని సందర్భములలో సమాచారమును అందించుటను తిరస్కరించుటకు కారణములు.

9. 8వ పరిచ్ఛేదపు నిబంధనలకు భంగము కలుగకుండా, కేంద్ర పౌరసమాచార అధికారి లేక సందర్భానుసారము రాజ్య పౌరసమాచార అధికారి, కోరిన సమాచారము రాజ్యము కాకుండా ఇతర వ్యక్తి కలిగియున్న కాపీరైటుకు ఉల్లంఘన జరిగినట్లయితే, ఆ సమాచారము కొరకు చేసుకొన్న అభ్యర్థనను తిరస్కరించవచ్చును.

సమాచారమును వేరుచేయదగుట.

10.(1) సమాచారము పొందుటకైన అభ్యర్థనను, వెల్లడిచేయుట నుండి మినహాయించబడిన సమాచారమునకు సంబంధించినదనే కారణముపై తిరస్కరించిన యెడల, అపుడు ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికినీ, ఈ చట్టము క్రింద వెల్లడిచేయుట నుండి మినహాయించబడిన ఏదేని సమాచారముయున్నట్టి భాగమును వేరుచేయుటకు వీలుంటే, మిగిలిన మినహాయించబడని సమాచారము వున్నట్టి రికార్డు యొక్క భాగమును పొందుటకు అనుమతినీయవచ్చును.

(2) ఉపపరిచ్ఛేదము (1)క్రింద రికార్డులోని భాగమునకు అనుమతి మంజూరు చేయబడిన యెడల కేంద్ర పౌరసమాచార అధికారి లేక సందర్భానుసారము రాజ్య పౌర సమాచార అధికారి, ఈ క్రింది విధముగా తెలియపరచుచూ, దరఖాస్తుదారునకు నోటీసును ఇవ్వవలెను:-

(ఎ) అభ్యర్థించిన రికార్డులో వెల్లడించుట నుండి మినహాయించబడిన సమాచారముయున్నట్టి రికార్డును వేరుచేసిన తరువాత మిగిలిన భాగము మాత్రమే అందించబడుచున్నదని;

(బి) కీలకమైన అంశంపై నిర్ధారించిన విషయాలు, ఆ విధంగా నిర్ధారణకు దారి తీసిన అంశాలతో సహా నిర్ణయానికి గల కారణాలు;

(సి) నిర్ణయము తీసుకొన్న వ్యక్తి పేరు, హోదా,

(డి) అతనిచే లేక ఆమెచే లెక్కించబడిన ఫీజు యొక్క వివరములు మరియు దరఖాస్తుదారు డిపాజిటు చేయవలసిన ఫీజు మొత్తము; మరియు

(ఇ) సమాచారంలో కొంత భాగమును వెల్లడి చేయకుండుటకు సంబంధించిన నిర్ణయముపైన విధించిన ఫీజుపైన, సమాచారం ఇచ్చే విధానంపైన పునర్విలోకనకు కోరే హక్కు దరఖాస్తుదారుకు కలదని; 19వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)క్రింద నిర్దిష్టపరచిన సీనియరు అధికారి వివరములతో సహా కేంద్ర సమాచార కమీషను లేక సందర్భానుసారము రాజ్య సమాచార కమీషను వివరాలు, కాలపరిమితి, ప్రక్రియ మరియు సమాచారం అందించు ఏదేని ఇతర విధానము.

మూడవ పక్షకారు యొక్క సమాచారము.

11(1) ఈ చట్టము క్రింద చేసిన అభ్యర్థనపై, మూడవ పక్షకారుకు సంబంధించిన లేక అతనిచే అందజేయబడి అది గోపనీయమైనదని అట్టి మూడవ పక్షకారుచే పరిగణింప బడిన సమాచారమును లేక రికార్డును లేక అందులోని భాగమును వెల్లడించవలెనని కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగా రాజ్య సమాచార అధికారి ఉద్దేశించిన యెడల, కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగా రాజ్య పౌరసమాచార అధికారి అట్టి అభ్యర్థన అందిన తేదీ నుండి అయిదు దినముల లోపల మూడవ పక్షకారుకు లిఖితపూర్వక నోటీసును ఇచ్చుట ద్వారా అట్టి అభ్యర్థన మేరకు సమాచారమును లేక రికార్డును లేక అందులోని భాగమును వెల్లడించవలెనని కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారముగా రాజ్య సమాచార అధికారి ఉద్దేశిస్తున్న విషయమును తెలియజేయ వలెను మరియు సమాచారమును వెల్లడించుటకు సంబంధించి మూడవ పక్షకారును మౌఖికముగాగాని లేక వ్రాతమూలకముగాగాని విన్నపము చేయవలెనని ఆహ్వానించవలెను మరియు సమాచారమును వెల్లడిచేయుట గురించి నిర్ణయము తీసుకొనునపుడు మూడవ పక్షకారు చేసిన విన్నపమును దృష్టియందుంచుకొనవలెను.

అయితే, శాసనము ద్వారా రక్షణయున్నట్టి వర్తక లేక వాణిజ్య రహస్యాల విషయ-ములో తప్ప, అట్టి మూడవ పక్షకారు ప్రయోజనమునకు ఏదేని హాని లేక నష్టము జరుగుటకు అవకాశమున్నప్పటికి ప్రజా హితము దృష్ట్యా వెల్లడించుట మేలని భావించినపుడు వెల్లడించుటకు అనుమతినీయవచ్చును.

(2) కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారము రాజ్య పౌర సమాచార అధికారి ఏదేని సమాచారము లేక రికార్డు లేక అందులోని భాగమునకు సంబంధించి ఉప-పరిచ్ఛేదము(1) క్రింద ఏదేని నోటీసును మూడవ పక్షకారుకు ఇచ్చినచో, ఆ మూడవ పక్షకారుకు ఆ నోటీసు జారీచేయబడిన తేదీ నుండి పదిదినముల లోపల ప్రతిపాదిత వెల్లడిపై విన్నపము చేసుకొనుటకు అవకాశమును ఈయవలెను.

(3) 7వ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికినీ, కేంద్ర పౌర సమాచార అధికారి లేక సందర్భానుసారము రాజ్య పౌర సమాచార అధికారి ఉపపరిచ్ఛేదము (2) క్రింద విన్నపము చేసుకొనుటకు మూడవ పక్షకారుకు అవకాశము ఇచ్చివున్నచో 6వ పరిచ్ఛేదము క్రింద అభ్యర్థన అందినప్పటి నుండి నలుబది దినముల లోపల సమాచారమును లేక రికార్డును లేక అందులోని భాగమును వెల్లడి చేయవలెనా వద్దా అను దానిపై నిర్ణయము తీసికొని దానిని లిఖితపూర్వక నోటీసు ద్వారా మూడవ పక్షకారుకు తెలియజేయవలెను.

(4) ఉపపరిచ్ఛేదము(3) క్రింద నోటీసులో, ఆనోటీసు ఈయబడిన మూడవ పక్షకారుకు 19వ పరిచ్ఛేదముక్రింద తీసుకొనిన నిర్ణయముపై అపీలు చేసుకొనుటకు హక్కు కలదని తెలుపు వివరణ చేరివుండవలెను.

అధ్యాయము - 3
కేంద్ర సమాచార కమీషను

కేంద్ర సమాచార కమీషను సంఘటన.

12.(1) కేంద్ర ప్రభుత్వము, అధికారిక గెజెటులో అధిసూచన ద్వారా, ఈ చట్టము క్రింద ఒసగబడిన అధికారములను వినియోగించుటకు మరియు అప్పగించబడిన కృత్యములను నిర్వర్తించుటకు కేంద్రసమాచార కమీషనుగా పేర్కొనబడు ఒక నికాయమును సంఘటితము చేయవలెను.

(2) కేంద్ర సమాచార కమీషను ఈ క్రింది వారితో కూడియుండవలెను;-

(ఎ) ప్రధాన సమాచార కమీషనరు, మరియు

(బి) పదిమందికి మించకుండా అవసరమని భావించునట్టి సంఖ్యలో కేంద్ర సమాచార కమీషనర్లు.

(3) ఈ క్రింది వారితో కూడియుండు కమిటీ సిఫారసుపై రాష్ట్రపతి ప్రధాన సమాచార కమీషనరును మరియు సమాచార కమీషనర్లను నియమించవలెను:-

(i) ప్రధానమంత్రి, ఆ కమిటీ యొక్క ఛైర్ పర్సన్ గా ఉండవలెను;

(ii) లోకసభలోని ప్రతిపక్ష నాయకుడు, మరియు

(iii) ప్రధాన మంత్రిచే నామనిర్దేశము చేయబడు ఒక కేంద్ర క్యాబినేటు మంత్రి.

విశదీకరణ:- సందేహముల నివృత్తి కొరకు లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఎవరూ గుర్తించబడనియెడల, ప్రతిపక్షములో ఏకైక పెద్దపార్టీ యొక్క నాయకుడు, ప్రతిపక్ష నాయకుడిగా భావించబడవలెనని ఇందుమూలముగా ప్రఖ్యానించబడినది.

(4) కేంద్ర సమాచార కమీషను యొక్క కార్యకలాపాల సాధారణ అధీక్షణ, ఆదేశము మరియు నిర్వహణ ప్రధాన సమాచార కమీషనరుకు సంక్రమిస్తాయి. ఆయనకు సమాచార కమీషనర్లు సహాయము అందిస్తారు. మరియు ఆయన ఈ చట్టము క్రింద, ఎవరేని ఇతర ప్రాధికారి ఇచ్చు ఆదేశములకు లోబడకుండా, స్వతంత్ర ప్రతిపత్తి గల కేంద్ర సమాచార కమీషనుచే వినియోగించబడు లేక అట్టి అన్ని అధికారములను వినియోగించ వచ్చును మరియు అట్టి అన్ని చర్యలను మరియు పనులను చేయవచ్చును.

(5) ప్రధానసమాచార కమీషనరు మరియు సమాచార కమీషనర్లు, న్యాయ శాస్త్రము, విజ్ఞాన శాస్త్రము మరియు సాంకేతిక శాస్త్రము, సాంఘీకసేవ, యాజమాన్యము, జర్నలిజమ్, ప్రసారమాధ్యమాలు లేక కార్యనిర్వహణ మరియు పరిపాలనలో విస్తార విజ్ఞానము మరియు అనుభవము గలిగి ప్రజా జీవనములో ప్రఖ్యాతి గాంచిన వ్యక్తులై ఉండవలెను.

(6) ప్రధాన సమాచార కమీషనరు లేక సమాచార కమీషనరు, పార్లమెంటు సభ్యుడు గాని లేక ఏదేని రాజ్య శాసనసభ్యుడు గాని లేక కేంద్ర పాలిత ప్రాంత శాసన సభ్యుడు గాని అయి ఉండరాదు లేక లాభదాయకమైన పదవిలో ఉండరాదు లేక ఏదేని రాజకీయపక్షంతో సంబంధంఉండరాదు లేక పదవిని లేక ఏదేని వ్యాపారమును గాని వృత్తినిగాని చేస్తూ యుండరాదు.

(7) కేంద్ర సమాచార కమీషను యొక్క ప్రధాన కార్యస్థానము ఢిల్లీలో ఉండవలెను మరియు కేంద్రప్రభుత్వ పూర్వానుమతితో కేంద్ర సమాచార కమీషను, భారత-దేశమునందు ఇతర ప్రాంతములలో కార్యాలయములను స్థాపించవచ్చును.

పదవీ కాలావధి మరియు సేవా షరతులు.

13.(1) ప్రధాన సమాచార కమీషనరు, తాను పదవిలో చేరిన తేదీ నుండి అయిదు సంవత్సరముల కాలావధి వరకు పదవియందు ఉండును. మరియు పునర్నియామకమునకు అర్హత కలిగియుండడు:

అయితే ప్రధాన సమాచార కమీషనరు ఎవరూ అరువది అయిదు సంవత్సరముల వయస్సు నిండిన మీదట అట్లు పదవియందు కొనసాగరాదు.

(2) ప్రతి సమాచారకమీషనరు అతను పదవిలో చేరిన తేదీనుండి అయిదు సంవత్సరముల కాలావధి వరకు లేక అరువది అయిదు సంవత్సరముల వయస్సు ముగియునంతవరకు, వీటిలో ఏది ముందయితే అప్పటివరకు పదవియందుండవలెను మరియు అట్టిసమాచార కమీషనరుగా పునర్నియామకమునకు అర్హుడుకాడు.

అయితే, ప్రతి సమాచార కమీషనరు, ఈ ఉపపరిచ్ఛేదము క్రింద అతను పదవి నుండి విరమించిన మీదట, 12వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3)లో నిర్దిష్టపరచిన రీతిలో ప్రధాన సమాచార కమీషనరుగా నియామకమునకు అర్హుడగును.

అంతేగాక, సమాచార కమీషనరు, ప్రధాన కమీషనరుగా నియమింపబడినచో, అతని పదవీ కాలావధి మొత్తంమీద సమాచార కమీషనరుగా మరియు ప్రధాన సమాచార కమీషనరుగా కలిసి అయిదు సంవత్సరములకు మించరాదు.

(3) ప్రధాన సమాచార కమీషనరు లేక సమాచార కమీషనరు, అతను పదవిలో చేరుటకు ముందు రాష్ట్రపతి సమక్షంలో లేదా ఈ విషయములో ఆయనచే నియమించ-బడిన ఎవరేని ఇతర వ్యక్తి సమక్షంలో ఇందునిమిత్తం మొదటి అనుసూచిలో పొందుపరచిన ప్రరూపములో ప్రమాణం లేక ప్రతిజ్ఞ చేయవలెను.

(4) ప్రధాన సమాచార కమీషనరు లేక సమాచార కమీషనరు, ఎప్పుడైనను స్వదస్తూరీతో రాష్ట్రపతికి లేఖ వ్రాసి పదవికి రాజీనామా చేయవచ్చును:

అయితే, ప్రధాన సమాచార కమీషనరును లేక సమాచార కమీషనరును 14వ పరిచ్ఛేదములో నిర్దిష్టపరచిన రీతిలో తొలగించ వచ్చును.

(5) చెల్లించవలసిన జీతభత్యములు మరియు ఇతర సేవా నిబంధనలు, సేవా షరతులు ఈ క్రింది విధముగా, అనగా:-

(ఎ) ప్రధాన సమాచార కమీషనరుకు ప్రధాన ఎన్నికల కమీషనరుకు ఉన్న విధంగానూ;

(బి) సమాచార కమీషనరుకు, ఎన్నికల కమీషనరుకు ఉన్న విధంగానూ; ఉండును:

అయితే ప్రధాన సమాచార కమీషనరు లేక సమాచార కమీషనరు ఆయన నియామకపు సమయంలో భారత ప్రభుత్వము లేదా రాజ్యప్రభుత్వము క్రిందచేసిన ఏదేని పూర్వపు సర్వీసుకుగాను, వైకల్యము లేదా గాయమునకు చెందిన పింఛను కాకుండా, పింఛను పొందుచున్న యెడల, ప్రధాన సమాచార కమీషనరుగా లేదా సమాచార కమీషనరుగా పొందుతున్న జీతము నుండి నగదురూపంలో మార్చుకొన్న పింఛనులోని భాగముతోసహా పింఛనును మరియు పదవీ విరమణ గ్రాట్యూటీకి సమానమగు పింఛనును మినహాయించి ఇతర రూపములో పదవీవిరమణ లబ్ధులకు సమానమగు పింఛను మొత్తమును తగ్గించవలెను.

అంతేగాక, ప్రధాన సమాచార కమీషనరు లేక సమాచార కమీషనరు, అతని నియామకము సమయములో ఏదేని కేంద్ర చట్టము లేదా రాజ్య చట్టము ద్వారా లేదా దాని క్రింద స్థాపించబడిన కార్పొరేషనులో కేంద్ర ప్రభుత్వ లేదా రాజ్య ప్రభుత్వ స్వామ్యము లేదా నియంత్రణ క్రిందయున్న ప్రభుత్వ కంపెనీలో చేసిన ఏదేని పూర్వపు సర్వీసుకు సంబంధించి పదవీ విరమణ లబ్ధులు పొందుచున్న యెడల ప్రధానసమాచార కమీషనరుగా లేదా సమాచారకమీషనరుగా పొందుచున్న అతని జీతము నుండి పదవీ విరమణ లబ్ధులకు సమానమగు పింఛను మొత్తమును తగ్గించవలెను;

అయితే ఇంకనూ, ప్రధాన సమాచార కమీషనరు మరియు సమాచార కమీషనరు యొక్క జీతములు, భత్యములు మరియు ఇతర సేవా షరతులు వారి నియామకమైన పిమ్మట, వారికి నష్టదాయకంగా ఉండరాదు.

(6) ప్రధాన సమాచార కమీషనరు మరియు సమాచార కమీషనరు ఈచట్టము క్రింద వారి కృత్యములను సమర్థవంతముగా నిర్వర్తించుటకు అవసరమగునట్టి అధికారులను మరియు ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వము ఏర్పాటు చేయవలెను మరియు ఈ చట్టపు ప్రయోజనాల నిమిత్తము నియమింపబడిన అధికారులు మరియు ఇతర ఉద్యోగులకు చెల్లించదగు జీతములు, భత్యములు మరియు ఇతర సేవా షరతులు విహితపరచబడినట్లుగా ఉండవలెను.

ప్రధాన సమాచార కమీషనరు లేక సమాచార కమీషనరు తొలగింపు.

14.(1) ఉపపరిచ్ఛేదము(3) యొక్కనిబంధనలకు లోబడి, ప్రధాన సమాచార కమీషనరును లేదా ఎవరేని సమాచార కమీషనరును, నిరూపిత దుష్ప్రవర్తన లేక అసమర్థత కారణములపై రాష్ట్రపతి ఉత్తరువు ద్వారా మాత్రమే పదవి నుండి తొలగించవలెను. రాష్ట్రపతి సూచనమేరకు సర్వోన్నత న్యాయస్థానం పరిశీలన జరిపి పై కారణములపై ప్రధాన సమాచార కమీషనరును లేదా సమాచార కమీషనరును పదవి నుండి తొలగించవచ్చునని నివేదించిన తర్వాత మాత్రమే రాష్ట్రపతి ఆ ఉత్తరువును జారీ చేయాలి.

(2) ఉప పరిచ్ఛేదము(1) క్రింద సర్వోన్నత న్యాయస్థానమునకు నిర్దేశము చేసిన సందర్భములో అట్టి నిర్దేశముపై సర్వోన్నత న్యాయస్థానము నుండి వచ్చిన నివేదికపై ఉత్తరువులు జారీచేయునంతవరకు రాష్ట్రపతి ప్రధాన సమాచార కమీషనరును లేదా సంబంధిత సమాచార కమీషనరును పదవి నుండి సస్పెండు చేయవచ్చును మరియు అవసరమని భావించిన యెడల విచారణ సమయములో అతను కార్యాలయమునకు హాజరగుటను కూడ నిషేధించవచ్చును.

(3) ఉపపరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికిని, రాష్ట్రపతి,* ప్రధాన సమాచార కమీషనరును లేదా సందర్భానుసారముగా, సమాచార కమీషనరును ఈ క్రింది సందర్భములలో, అనగా అతడు

(ఎ) దివాలాదారుగా న్యాయ నిర్ణయము చేయబడినచో;

(బి) రాష్ట్రపతి అభిప్రాయములో నీతిబాహ్యతతో కూడిన ఏదేని అపరాధమునకు దోషస్థాపితుడైనచో; లేదా

(సి) అతని పదవీకాల సమయమునందు, అతని పదవికి సంబంధించిన కర్తవ్యములు కాకుండా ఏదేని చెల్లింపుతో కూడిన ఇతర ఉద్యోగములో నిమగ్నమైనచో; లేదా

(డి) శారీరకంగా లేక మానసికంగా దుర్భలులై పదవియందు కొనసాగుటకు అనర్హుడని రాష్ట్రపతి అభిప్రాయపడినచో; లేదా

(ఇ) ప్రధాన సమాచార కమీషనరుగా లేదా సమాచార కమీషనరుగా అతని కృత్యములకు ప్రతికూలముగా ప్రభావము చూపు విధముగా అట్టి ఆర్థిక ప్రయోజనాలను లేక ఇతర ప్రయోజనాలను పొందినపుడు;

ఉత్తరువు ద్వారా ఆ పదవి నుండి తొలగించవచ్చును.

---

* ప్రధాన సమాచార కమీషనరు లేదా సమాచార కమీషనరు పదవుల నుండి

(4) ప్రధాన సమాచార కమీషనరు లేదా సమాచార కమీషనరు, ఏ విధముగా-నైనను భారత ప్రభుత్వము ద్వారా లేక దానితరఫున చేసుకొన్న ఏదేని కాంట్రాక్టు లేక కరారులో సంబంధము లేక హితము కలిగియున్నచో లేక ఏదేని స్థాపించబడిన కంపెనీలో ఒక సభ్యుడిగా కాకుండా ఇతర సభ్యులతో సమానముగా దాని యొక్క లాభాలలో లేదా దాని నుండి ఉత్పన్నమగు ఉపలబ్ధులలో ఏ విధముగానైనను పాలుపంచుకొన్నచో, అతడు ఉపపరిచ్ఛేదము (1) యొక్క ప్రయోజనముల నిమిత్తము దుష్ప్రవర్తనకు దోషస్థాపితుడైనట్లు భావించబడవలెను.

అధ్యాయము - 4
రాజ్య సమాచార కమీషను

రాజ్య సమాచార కమీషను సంఘటన.

15.(1) ప్రతి రాజ్య ప్రభుత్వము, అధికారిక గెజెటులో అధిసూచన ద్వారా, ఈ చట్టము క్రింద తనకు ఒసగబడిన అధికారములను వినియోగించుటకు మరియు అప్పగించ-బడిన కృత్యములను నిర్వర్తించుటకు . . . . (రాజ్యము పేరు) సమాచార కమీషనుగా పేర్కొనబడు ఒక నికాయమును సంఘటితము చేయవలెను.

(2) రాజ్య సమాచార కమీషను, ఈ క్రింది వారితో కూడియుండవలెను,-

(ఎ) రాజ్య ప్రధాన సమాచార కమీషనరు; మరియు

(బి) పదిమందికి మించకుండా అవసరమని భావించునట్టి సంఖ్యలో రాజ్య సమాచార కమీషనర్లు.

(3) ఈ క్రింది వారితో కూడియుండు కమిటీ సిఫారసుపై గవర్నరు రాజ్య ప్రధాన సమాచార కమీషనరును మరియు రాజ్యసమాచార కమీషనర్లను నియమించవలెను, -

(i) ముఖ్యమంత్రి, ఈయన కమిటీ యొక్క ఛైర్‌పర్సన్‌గా ఉండవలెను;

(ii) శాసనసభలోని ప్రతిపక్ష నాయకుడు; మరియు

(iii) ముఖ్యమంత్రిచే నామనిర్దేశము చేయబడు ఒక క్యాబినెటు మంత్రి.

విశదీకరణము:- సందేహములను తొలగించు నిమిత్తము, శాసనసభ ప్రతిపక్ష నాయకుడుగా ఎవరూ గుర్తించబడని యెడల, శాసన సభలో ప్రతిపక్షములో ఏకైక పెద్ద పార్టీ యొక్క నాయకుడు ప్రతిపక్ష నాయకుడిగా భావించబడవలెనని ఇందుమూలముగా ప్రఖ్యానించబడినది.

(4) రాజ్య సమాచార కమీషను యొక్క కార్యకలాపాల సాధారణ అధీక్షణ, ఆదేశము మరియు నిర్వహణ రాజ్య ప్రధాన సమాచార కమీషనరులో నిహితమైయుండును

మరియు ఆయనకు రాజ్య సమాచార కమీషనర్లు సహాయమునందించవలెను మరియు ఆయన ఈ చట్టము క్రింద, ఎవరేని ఇతర ప్రాధికారి ఇచ్చు ఆదేశములకు లోబడకుండా, స్వతంత్ర ప్రతిపత్తి గల రాజ్యసమాచార కమీషనుచే వినియోగించబడు లేక చేయబడు అట్టి అన్ని అధికారములకు వినియోగించవచ్చును మరియు అన్ని అట్టి చర్యలను మరియు పనులను చేయవచ్చును.

(5) రాజ్య ప్రధాన సమాచార కమీషనరు మరియు రాజ్య సమాచార కమీషనర్లు, న్యాయశాస్త్రము, విజ్ఞానశాస్త్రము మరియు సాంకేతిక శాస్త్రము, సాంఘికసేవ, నిర్వహణ, జర్నలిజమ్, ప్రసార మాధ్యమాలు లేక పరిపాలన మరియు నిర్వహణలో విస్తార విజ్ఞానము మరియు అనుభవము కలిగి ప్రజా జీవనములో ప్రఖ్యాతి గాంచిన వ్యక్తులై ఉండవలెను.

(6) రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేక రాజ్య సమాచార కమీషనరు, పార్లమెంటు సభ్యుడుగాని లేక ఏదేని రాజ్య శాసనసభ్యుడు గాని లేక సందర్భానుసారము, కేంద్రపాలిత ప్రాంతశాసన సభ్యుడు గాని అయివుండరాదు లేక లాభదాయకమైన పదవిలో ఉండరాదు లేక ఏదేని రాజకీయ పక్షంతో సంబంధం ఉండరాదు లేక ఏదేని ఇతర పదవిని కలిగియుండరాదు లేక ఏదేని వృత్తినిగాని వ్యాపారమునుగాని చేస్తూ యుండరాదు.

(7) రాజ్య సమాచార కమీషను యొక్క ప్రధాన కార్యస్థానము రాజ్య ప్రభుత్వముచే, అధికారిక గెజెటులో అధిసూచన ద్వారా నిర్థిష్టపరచునట్టి రాజ్యములోని అట్టి స్థలములో నుండవలెను మరియు రాజ్య సమాచార కమీషను, రాజ్య ప్రభుత్వ పూర్వానుమతితో రాజ్యమునందు ఇతర స్థలములలో కార్యాలయములను స్థాపించ వచ్చును.

పదవీ కాలావధి మరియు సేవా షరతులు.

16.(1) రాజ్య ప్రధాన సమాచార కమీషనరు, అతను పదవిలో చేరిన తేదీ నుండి అయిదు సంవత్సరముల కాలావధి వరకు పదవియందు ఉండును మరియు పునర్నియామకమునకు అర్హత కలిగియుండడు:

అయితే రాజ్య ప్రధాన సమాచార కమీషనరు ఎవరూ అరువది అయిదు సంవత్సరముల వయస్సు నిండిన పిమ్మట అట్లు పదవియందు కొనసాగరాదు.

(2) ప్రతి రాజ్య సమాచార కమీషనరు అతను పదవిలో చేరిన తేదీ నుండి అయిదు సంవత్సరముల కాలావధి వరకు లేక అరువది అయిదు సంవత్సరముల వయస్సు ముగియునంతవరకు, వీటిలో ఏది ముందయితే అప్పటివరకు పదవియందుండవలెను మరియు అట్టి రాజ్య సమాచార కమీషనరుగా పునర్నియామకమునకు అర్హుడుకాడు.

22/G22

అయితే, ప్రతి రాజ్య సమాచార కమీషనరు, ఈ ఉప పరిచ్ఛేదము క్రింద అతను పదవి నుండి విరమించిన మీదట, 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము(3) లో నిర్థిష్టపరచిన రీతిలో రాజ్య ప్రధాన సమాచార కమీషనరుగా నియామకమునకు అర్హుడుగును.

అంతేగాక, రాజ్య సమాచార కమీషనరు, రాజ్య ప్రధాన సమాచార కమీషనరుగా నియమింపబడినచో, అతని పదవీ కాలావధి మొత్తం మీద రాజ్య సమాచార కమీషనరుగా మరియు రాజ్య ప్రధాన సమాచార కమీషనరుగా కలిసి అయిదు సంవత్సరములకు మించరాదు.

(3) రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేక రాజ్య సమాచార కమీషనరు, అతను పదవిలో చేరుటకు ముందు, గవర్నరు సమక్షంలో లేక ఈ విషయములో ఆయనచే నియమించబడిన ఎవరేని ఇతర వ్యక్తి సమక్షంలో ఇందు నిమిత్తం మొదటి అనుసూచిలో పొందుపరచిన ప్రరూపములో ప్రమాణ స్వీకారము చేయవలెను.

(4) రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేక రాజ్య సమాచార కమీషనరు, ఎప్పుడైనను స్వదస్తూరీతో గవర్నరుకు లేఖరాసి పదవికి రాజీనామా చేయవచ్చును.

అయితే, రాజ్య ప్రధాన సమాచార కమీషనరును లేక రాజ్య సమాచార కమీషనరును 17వ పరిచ్ఛేదములో నిర్థిష్టపరచిన రీతిలో తొలగించవచ్చును.

(5) ఈ క్రింది వారికి చెల్లించవలసిన జీతములు మరియు భత్యములు ఇతర సేవా నిబంధనలు మరియు సేవా షరతులు ఈ క్రింది విధముగా నుండవలెను,-

(ఎ) రాజ్య ప్రధాన సమాచార కమీషనరుకు, ఎన్నికల కమీషనరు వలెనే ఉండవలెను.

(బి) రాజ్య సమాచార కమీషనరుకు రాజ్యప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వలెనే ఉండవలెను:

అయితే, రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేదా రాజ్య సమాచార కమీషనరు తన నియామకము సమయమున భారత ప్రభుత్వము లేదా రాజ్య ప్రభుత్వము క్రింద చేసిన ఏదేని పూర్వపు సర్వీసుకుగాను, వైకల్యము లేదా గాయము వలన పొందుచున్న పింఛను కాకుండా, పింఛను పొందుచున్నచో, రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేదా రాజ్య సమాచారకమీషనరు సర్వీసుకు సంబంధించిన అతని జీతము నుండి నగదు రూపంలో మార్చుకొన్న (కమ్యూట్) పింఛనులోని భాగంతో సహా పింఛనును మరియు పదవి విరమణ గ్రాట్యుటీకి సమానమైన పింఛను మినహాయించి ఇతరరూపములో పదవీవిరమణ లబ్ధులకు సమానమైన పింఛనుమొత్తమును తగ్గించవలెను;

అంతేకాక, రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేదా రాజ్య సమాచార కమీషనరు, తన నియామకము సమయమున ఏదేని కేంద్ర చట్టము లేదా రాజ్య చట్టముచే లేదా దాని క్రింద స్థాపించబడిన కార్పొరేషనులో గాని లేదా కేంద్ర ప్రభుత్వము లేదా రాజ్య ప్రభుత్వ స్వామ్యము లేదా నియంత్రణ క్రింద ఉన్న ప్రభుత్వ కంపెనీలో గాని చేసిన ఏదేని పూర్వపు సర్వీసుకు సంబంధించి పదవీ విరమణ లబ్ధులు పొందుచున్నయెడల, రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేదా రాజ్యసమాచార కమీషనరుగా చేసిన సర్వీసుకు సంబంధించి అతని జీతము నుండి పదవీవిరమణ లబ్ధులకు సమానమైన పింఛను మొత్తమును తగ్గించవలెను.

అయితే ఇంకనూ, రాజ్య ప్రధాన సమాచార కమీషనరు మరియు రాజ్య సమాచార కమీషనరు యొక్క జీతభత్యములు మరియు ఇతర సేవా షరతులు వారి నియామకము తరువాత వారికి నష్టదాయకంగా ఉండరాదు.

(6) రాజ్య ప్రభుత్వము, రాజ్య ప్రధాన సమాచార కమీషనరు మరియు రాజ్య సమాచార కమీషనర్లకు ఈచట్టము క్రిందవారి కృత్యములను సమర్థవంతంగా నిర్వర్తించు-టకుగాను అవసరమైనట్టి అధికారులను, ఉద్యోగులను ఏర్పాటు చేయవలెను మరియు ఈ చట్టపు ప్రయోజనము నిమిత్తము నియమింపబడిన అధికారులు మరియు ఇతర ఉద్యోగులకు చెల్లించదగు జీతములు, భత్యములు మరియు సేవా షరతులు విహితపరచ బడినట్లుగా ఉండవలెను.

రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేదా రాజ్య సమాచార కమీషనర్ల తొలగింపు.

17.(1) ఉప-పరిచ్ఛేదము (3)లోని నిబంధనలకు లోబడి, రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేదా రాజ్య సమాచార కమీషనరును రుజువైన దుష్ప్రవర్తన లేదా అసమర్థత కారణములపై గవర్నరు ఉత్తరువు ద్వారా మాత్రమే పదవి నుండి తొలగించవలెను. గవర్నరు సూచన మేరకు సర్వోన్నత న్యాయస్థానం పరిశీలన జరిపి దుష్ప్రవర్తన లేక అసమర్థత కారణంపై రాజ్య ప్రధాన సమాచార కమీషనరును లేదా రాజ్య సమాచార కమీషనరును పదవి నుండి తొలగించవచ్చునని నివేదించిన తర్వాత మాత్రమే గవర్నరు ఆ ఉత్తరువును జారీ చేయాలి.

(2) గవర్నరు, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద సర్వోన్నత న్యాయస్థానమునకు నిర్దేశము చేసిన సందర్భములో, అట్టి నిర్దేశముపై సర్వోన్నత న్యాయస్థానము యొక్క నివేదిక అందిన మీదట, ఉత్తరువులు జారీ చేయునంతవరకు గవర్నరు రాజ్య ప్రధాన సమాచార కమీషనరును లేదా రాజ్య సమాచార కమీషనరును పదవి నుండి సస్పెండు చేయవచ్చును మరియు అవసరమని భావించినయెడల పరిశీలన సమయమున కార్యాలయమునకు హాజరగుట నుండి కూడా నిషేధించవచ్చును.

(3) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమిఉన్నప్పటికినీ, గవర్నరు,* రాజ్య ప్రధాన సమాచార కమీషనరును లేదా సందర్భానుసారంగా రాజ్యసమాచార కమీషనరును, ఈ క్రింది సందర్భములలో అనగా, ఆయన,

(ఎ) దివాలాదారుగా న్యాయ నిర్ణయము చేయబడినచో; లేదా

(బి) గవర్నరు ఉద్దేశములో నీతిబాహ్యతతో కూడిన అపరాధమునకు దోషస్థాపితుడైనచో; లేదా

(సి) తన పదవీ కాలావధిలో అతని పదవికి సంబంధించిన కర్తవ్యములు కాకుండా చెల్లింపుతో కూడిన ఇతర ఉద్యోగంలో నిమగ్నమైనచో; లేదా

(డి) గవర్నరు ఉద్దేశములో మానసిక లేదా శారీరకదౌర్బల్యం కారణముపై పదవిలో కొనసాగుటకు అనర్హుడని అభిప్రాయపడినచో; లేదా

(ఇ) రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేదా రాజ్య సమాచార కమీషనరుగా తన కృత్యములకు ప్రతికూలముగా ప్రభావము చూపువిధముగా అట్టి ఆర్థిక లేదా ఇతర విధముగా అట్టిప్రయోజనాలను పొందినచో,

ఉత్తరువు ద్వారా ఆ పదవి నుండి తొలగించవచ్చును.

(4) రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేదా రాజ్య సమాచార కమీషనరు ఏ విధంగానైనను రాజ్య ప్రభుత్వముచే లేదా దాని తరఫున చేయబడిన ఏదేని కాంట్రాక్టు లేదా కరారులో సంబంధము లేదా హితము కలిగియున్నచో లేదా స్థాపించబడిన కంపెనీలో ఒక సభ్యుడుగా లేక ఇతర సభ్యులతో సమానముగా గాకుండా దానియొక్క లాభములో లేదా ఏదేని ప్రయోజనము లేదా దాని నుండి ఉత్పన్నమగు ప్రతిఫలములో ఏ విధముగానైనను పాలుపంచుకొన్నచో అతడు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ప్రయోజనముల నిమిత్తం దుష్ప్రవర్తనకు దోషస్థాపితుడైనట్లు భావించబడవలెను.

అధ్యాయము - 5

సమాచార కమీషన్ల అధికారములు, కృత్యములు, అపీళ్లు మరియు పెనాల్టీలు

సమాచార కమీషన్ల అధికారములు, మరియు కృత్యములు.

18.(1) ఈ చట్టపు నిబంధనలకు లోబడి, కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారముగా, రాజ్య సమాచార కమీషను, ఈ క్రింది సందర్భములలో, అనగా;-

---

* రాజ్య ప్రధాన సమాచార కమీషనరు లేదా రాజ్య సమాచార కమీషనరు పదవుల నుండి

(ఎ) ఈ చట్టము క్రింద అట్టి ఏ అధికారి నియమించబడలేదను కారణముచేగాని లేదా కేంద్ర సహాయ పౌర సమాచార అధికారి లేదా సందర్భానుసారముగా రాజ్య సహాయ పౌర సమాచార అధికారి, ఈ చట్టము క్రింద సమాచారము కొరకు లేదా అప్పీలుకై అతని లేదా ఆమె దరఖాస్తును 19వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)లో నిర్దిష్టపరచిన కేంద్ర పౌర సమాచార అధికారి లేదా రాజ్య పౌర సమాచార అధికారి లేదా సీనియరు అధికారికి లేదా కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారముగా, రాజ్య సమాచార కమీషనుకు పంపుటకై అతని లేదా ఆమె దరఖాస్తును స్వీకరించుటకు నిరాకరించినాడను కారణము వలన, కేంద్ర సమాచార అధికారికి లేదా రాజ్య సమాచార అధికారికి, అభ్యర్థనను సమర్పించుటకు వీలు కానప్పుడు;

(బి) ఈ చట్టము క్రింద అభ్యర్థించిన ఏదేని సమాచారమును పొందుటకు నిరాకరించినప్పుడు;

(సి) ఈ చట్టము క్రింద నిర్దిష్టపరచిన కాలపరిమితి లోపల సమాచారము కొరకు లేదా సమాచారమును తెలుసుకొనుట కొరకైన అభ్యర్థనకు సమాధాన మివ్వనప్పుడు;

(డి) చెల్లించవలసినదిగా కోరబడిన ఫీజు మొత్తము సహేతుకముగా లేదని అతడు/ఆమె భావించినప్పుడు;

(ఇ) ఈ చట్టము క్రింద అతడు లేక ఆమెకు అసంపూర్తిగా, తప్పుదోవపట్టించే విధంగా లేదా తప్పుడు సమాచారమును అందించారని భావించినప్పుడు;

(ఎఫ్) ఈ చట్టము క్రింద రికార్డులను కోరుటకు లేదా పొందుటకు సంబంధించిన ఏదేని ఇతర విషయంలో;

ఎవరేని వ్యక్తి నుండి ఫిర్యాదుని తీసికొని పరిశీలించుటకు కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారంగా రాజ్య సమాచార కమీషను కర్తవ్యమైయుండును.

(2) కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారంగా రాజ్య సమాచార కమీషను విషయాన్ని గురించి పరిశీలనచేయుటకు తగినకారణములు గలవని సంతృప్తి చెందిన యెడల దానికి సంబంధించి పరిశీలన ప్రారంభించవచ్చును.

1908లో 5వది.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద ఏదేని విషయమును పరిశీలన జరుపుతున్నపుడు కేంద్ర సమాచార కమీషను లేక రాజ్య సమాచార కమీషనుకు సివిలు ప్రక్రియా స్మృతి, 1908 క్రింద ఏదేని దావాను విచారణ జరుపునప్పుడు సివిలు న్యాయ స్థానమునకు ఏలాంటి అధికారాలు ఉంటాయో ఈ క్రింది విషయములకు సంబంధించి అవే అధికారాలు ఉంటాయి, అవేవనగా:-

(ఎ) వ్యక్తులహాజరుకై సమన్లు జారీచేసి వారిని తప్పనిసరిగా హాజరు అగునట్లు చేయుట మరియు వారిని ప్రమాణముపై మౌఖిక లేదా వ్రాతపూర్వక సాక్ష్యము ఇవ్వమని మరియు పత్రాలను లేదా వస్తువులను దాఖలు చేయమని బలవంతము చేయుట;

(బి) పత్రాలను వెల్లడి మరియు తనిఖీ చేయమని కోరుట;

(సి) అఫిడవిట్టుపై సాక్ష్యమును స్వీకరించుట;

(డి) ఏదేని న్యాయ స్థానము లేదా కార్యాలయము నుండి ప్రభుత్వ రికార్డులు లేదా నకళ్లను అభ్యర్థించుట;

(ఇ) సాక్షులను లేదా పత్రాలను పరీక్షించుటకొరకు సమన్లను జారీచేయుట;

(ఎఫ్) విహితపరచబడునట్టి ఏదేని ఇతర విషయము.

(4) పార్లమెంటు లేదా సందర్భానుసారంగా రాజ్య శాసనమండలి యొక్క ఏదేని ఇతర చట్టములో దీనికి అసంగతంగా ఏమున్నప్పటికినీ, కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారముగా రాజ్యసమాచార కమీషను, ఈచట్టము క్రింద ఏదేని ఫిర్యాదును పరిశీలన జరుపు సమయములో సార్వజనిక ప్రాధికార సంస్థ నియంత్రణలో ఉన్నట్టి ఈ చట్టము వర్తించు ఏదేని రికార్డును పరిశీలించవచ్చును మరియు దీనినుండి ఏ కారణముల-పైనను అట్టి రికార్డును మినహాయించి ఉంచరాదు.

అప్పీలు. 19.(1) ఉప-పరిచ్ఛేదము(1) లేదా 7వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3)లోని ఖండము (ఎ)లో నిర్దిష్టపరచబడిన సమయములోపల నిర్ణయము అందుకోలేని వ్యక్తి లేదా కేంద్ర పౌరసమాచార అధికారి లేదా సందర్భానుసారముగా రాజ్యపౌర సమాచార అధికారి యొక్క నిర్ణయముచే వ్యధితుడైన ఎవరేని వ్యక్తి, అట్టి కాలావధి ముగిసిన నాటి నుండి లేదా అట్టి నిర్ణయము అందుకొనిన నాటి నుండి ముప్పది దినముల లోపల ప్రతి సార్వజనిక ప్రాధికార సంస్థలో ఉన్నట్టి కేంద్ర పౌర సమాచార అధికారి కంటే లేదా సందర్భానుసారముగా రాజ్య పౌర సమాచార అధికారి కంటే సీనియరు హోదాలో ఉన్నట్టి అధికారికి అపీలు చేసుకొనవచ్చును:

అయితే, సకాలములో అపీలు దాఖలు చేయుట నుండి అపీలుదారు సరిఅయిన కారణము వలన నిరోధించబడినాడని అతడు లేక ఆమె భావించినచో, అట్టి అధికారి ముప్పది దినముల కాలావధి పూర్తిఅయిన తరువాత కూడా అప్పీలును స్వీకరించవచ్చును.

(2) 11వ పరిచ్ఛేదము క్రింద మూడవ పక్షకారు యొక్క సమాచారమును వెల్లడించవలసిందిగా కేంద్ర పౌర సమాచార అధికారి లేదా సందర్భానుసారముగా రాజ్య పౌర సమాచార అధికారి చేసిన ఉత్తరువుపై అప్పీలు దాఖలు చేయునపుడు, సంబంధిత మూడవ పక్షకారుచే ఉత్తరువు తేదీ నుండి ముప్పది దినముల లోపల అప్పీలు దాఖలు చేయబడవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద తీసుకొనిన నిర్ణయముపై రెండవ అప్పీలును, నిర్ణయము చేయవలసియున్న తేదీ నుండి గాని లేదా వాస్తవంగా నిర్ణయము అందిన తేదీ నుండి తొంబది దినముల లోపల కేంద్ర సమాచార కమీషను లేదా రాజ్య సమాచార కమీషను వద్ద దాఖలు చేయవలెను.

అయితే, సకాలములో అప్పీలు దాఖలు చేయుట నుండి అపీలుదారును నిరోధించ బడుటకు సరిఅయిన కారణము కలదని కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారముగా రాజ్య సమాచార కమీషను భావించినచో, తొంబది దినముల కాలావధి ముగిసిన పిమ్మట కూడా అప్పీలును స్వీకరించవచ్చును.

(4) కేంద్ర పౌర సమాచార అధికారి లేదా సందర్భానుసారముగా రాజ్య పౌర సమాచార అధికారి యొక్క నిర్ణయముపై దాఖలు చేయబడిన అప్పీలు మూడవ పక్షకారు యొక్క సమాచారమునకు సంబంధించినది అయినచో, కేంద్ర సమాచారకమీషను లేదా సందర్భానుసారముగా రాజ్య సమాచార కమీషను సదరు మూడవ పక్షకారుకు ఆకర్ణింపబడుటకు గాను తగిన అవకాశమును ఇవ్వవలెను.

(5) ఏదేని అప్పీలు ప్రొసీడింగులలో అభ్యర్థన నిరాకరణ సమర్థనీయమైనదని రుజువుచేయు భారము అభ్యర్థనను నిరాకరించిన కేంద్ర పౌర సమాచార అధికారి లేదా సందర్భానుసారముగా రాజ్య పౌర సమాచార అధికారిపై ఉండును.

(6) ఉప-పరిచ్ఛేదము(1) లేదా ఉప-పరిచ్ఛేదము (2) క్రింద అప్పీలు స్వీకరించిన ముప్పది దినముల లోపల లేదా సందర్భానుసారముగా వ్రాతమూలకముగా రికార్డుచేయు కారణముపై దానిని దాఖలు చేసిన తేదీ నుండి మొత్తము నలభైఅయిదు దినములకు మించనట్టి పొడిగింపబడిన కాలావధిలోపల అప్పీలును పరిష్కరించవలెను.

(7) కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారముగా రాజ్య సమాచార కమీషను యొక్క నిర్ణయము అనుసరణీయమై ఉండవలెను.

F-3

(8) కేంద్రసమాచార కమీషనుకు లేదా సందర్భానుసారముగా రాజ్య సమాచార కమీషనుకు నిర్ణయం తీసుకోవడంలో ఈ క్రింది అధికారాలు ఉంటాయి;-

(ఎ) సార్వజనిక ప్రాధికార సంస్థను ఈ చట్టము యొక్క నిబంధనలను పాటించుటలో ఈ క్రింది వాటితో సహా అవసరమైన ఏవేని అట్టి చర్యలను తీసుకొనమని కోరవచ్చును,-

(i) కోరిన ప్రరూపములో సమచారం అందించుటకు ఏర్పాటుచేయమని;

(ii) కేంద్ర పౌరసమాచార అధికారిని లేదా సందర్భానుసారముగా రాజ్యపౌర సమాచార అధికారిని నియమించమని;

(iii) నిశ్చితమైన సమాచారమును లేదా కొన్ని విభాగాల సమాచారమును ప్రచురించమని;

(iv) రికార్డుల నిర్వహణ, యాజమాన్యము మరియు విధ్వంసమునకు సంబంధించి వాటి ఆచరణలకు అవసరమైన మార్పులుచేయమని;

(v) దాని అధికారులకు సమాచార హక్కుపై శిక్షణ ఇచ్చే సదుపాయములను హెచ్చించమని;

(vi) 4వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (బి)ను పాటిస్తూ వార్షిక నివేదికను దానికి అందజేయమని;

(బి) ఫిర్యాదిదారుకు జరిగిన ఏదేని నష్టము లేదా హానికిగాను పరిహారము ఇవ్వవలెనని సార్వజనిక ప్రాధికార సంస్థను కోరుట;

(సి) ఈ చట్టము క్రింద నిబంధించబడిన ఏవేని పెనాల్టీలను విధించుట;

(డి) దరఖాస్తును తిరస్కరించుట.

(9) కేంద్రసమాచార కమీషను లేదా సందర్భానుసారంగా రాజ్య సమాచార కమీషను తన నిర్ణయాన్ని, అప్పీలు చేయు హక్కు ఉంటే ఆ వివరాలతో సహా, ఫిర్యాదు-దారుకు మరియు సార్వజనిక ప్రాధికారముకు నోటీసు ద్వారా తెలియజేయవలెను.

(10) కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారంగా రాజ్య సమాచార కమీషను విహితపరచబడినట్టి ప్రక్రియననుసరించి అప్పీలుపై నిర్ణయమును చేయవలెను.

పెనాల్టీలు.

20.(1) కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారంగా రాజ్య సమాచార కమీషను, ఏదేని ఫిర్యాదు లేదా అప్పీలును నిర్ణయించు సమయములో, కేంద్ర పౌర సమాచార అధికారి లేదా సందర్భానుసారముగా రాజ్య పౌర సమాచార అధికారి ఎటువంటి సబబైన కారణము లేకుండా సమాచారము కొరకైన దరఖాస్తును స్వీకరించుటకు నిరాకరించి-నాడని లేదా 7వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నిర్దిష్టపరచబడిన సమయము

లోపల సమాచారమును అందజేయలేకపోయినాడని లేదా సమాచారము కొరకైన అభ్యర్థనను దురుద్దేశపూర్వకంగా నిరాకరించినాడని లేదా అభ్యర్థించిన సమాచారమును తెలిసికూడా తప్పుగా, అసంపూర్తిగా లేదా తప్పుదోవపట్టించు సమాచారమును లేదా అభ్యర్థించిన విషయ వస్తువు యొక్క సమాచారమును నాశనము చేసినాడని లేదా సమాచారమును అందజేయుటలో ఏదేని రీతిగా ఆటంకపరిచినాడని భావించినయెడల, దరఖాస్తును స్వీకరించునంత వరకు లేదా సమాచారమును అందజేయునంతవరకు రోజుకు రెండు వందల యాభై రూపాయల చొప్పున పెనాల్టీని విధించవలెను. అయితే, అట్టి పెనాల్టీ మొత్తము ఇరవై అయిదువేల రూపాయలకు మించరాదు:

అయితే, కేంద్ర పౌర సమాచార అధికారిపై లేదా సందర్భానుసారముగా రాజ్య పౌర సమాచార అధికారిపై ఏదేని పెనాల్టీని విధించుటకు ముందు అతనికి విన్నవించు కొనుటకు తగిన అవకాశమును ఇవ్వవలెను.

అంతేగాక, తాను సహేతుకముగా మరియు జాగ్రత్తగానే వ్యవహరించినానని రుజువు చేసుకొను భారము కేంద్ర పౌర సమాచార అధికారి లేదా సందర్భానుసారముగా రాజ్య పౌర సమాచార అధికారిపైనే ఉండును.

(2) కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారముగా రాజ్య సమాచార కమీషను ఏదేని ఫిర్యాదు లేదా అప్పీలును నిర్ణయించు సమయములో, కేంద్రపౌర సమాచార అధికారి లేదా సందర్భానుసారముగా రాజ్య పౌర సమాచార అధికారి ఎటువంటి సబబైన కారణము లేకుండా నిరంతరంగా సమాచారము కొరకైన దరఖాస్తును స్వీకరించుటకు నిరాకరించినాడని లేదా 7వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నిర్దిష్టపరచబడిన సమయము లోపల సమాచారమును అందచేయలేక పోయినాడని లేదా సమాచారము కొరకైన అభ్యర్థనను దురుద్దేశ పూర్వకంగా నిరాకరించినాడని లేదా అభ్యర్థించిన సమాచారమును తెలిసి కూడ తప్పుగా, అసంపూర్తిగా లేదా తప్పుదోవ పట్టించు సమాచారము లేదా అభ్యర్థించిన విషయ వస్తువు యొక్క సమాచారమును నాశనము చేసినాడని లేదా సమాచారమును అందజేయుటలో ఏదేని రీతిగా ఆటంకపరచినాడని భావించిన యెడల, కేంద్ర పౌర సమాచార అధికారిపై లేదా సందర్భానుసారముగా రాజ్య పౌర సమాచార అధికారిపై అతనికి వర్తించు సర్వీసు నియమముల క్రింద క్రమశిక్షణ చర్యకై సిఫారసు చేయవలెను.

అధ్యాయము - 6

వివిధములు

సద్భావముతో తీసికొనిన చర్యలకు రక్షణ.

21. ఈ చట్టము క్రింద లేదా దాని క్రింద చేసిన ఏదేని నియమము క్రింద సద్భావముతో చేసిన లేదా చేయుటకు ఉద్దేశించిన దేనికైనను ఎవరేని వ్యక్తిపై ఎట్టి దావా, అభియోగము లేదా ఇతర శాసనిక చర్య ఉండరాదు.

చట్టము అధిగమించు ప్రభావము కలిగి యుండుట. 1923లోని 19వది.

22. అధికార రహస్యముల చట్టము, 1923 మరియు తత్సమయమున అమలు నందున్న ఏదేని ఇతర శాసనములలో లేదా ఈ చట్టము కాకుండా ఏదేని ఇతర శాసనము వలన ప్రభావము కలిగివున్న ఏదేని పత్రములో దీనికి అసంగతముగా ఏమున్నప్పటికిని ఈ చట్టపు నిబంధనలు అమలు కలిగి ఉండవలెను.

న్యాయస్థానముల అధికారితా పరిధికి ప్రతిబంధకము.

23. ఈ చట్టము క్రింద చేసిన ఏదేని ఉత్తరువుకు సంబంధించి ఎట్టి దావా, దరఖాస్తు లేదా ఇతర ప్రొసీడింగును ఏ న్యాయస్థానము స్వీకరించరాదు మరియు అట్టి ఉత్తరువు ఏదియు ఈ చట్టము క్రింద చేయు అప్పీలు ద్వారా కాకుండా ఇతరవిధంగా ప్రశ్నించబడరాదు.

ఈ చట్టము కొన్ని వ్యవస్థలకు వర్తించకుండుట.

24.(1) కేంద్రప్రభుత్వముచే స్థాపించబడిన వ్యవస్థలుగా రెండవ అనుసూచిలో నిర్దిష్టపరచబడిన రహస్య సమాచార మరియు భద్రతా వ్యవస్థలకు లేదా అట్టి వ్యవస్థలు ప్రభుత్వమునకు అందజేసిన ఏదేని సమాచారమునకు ఈ చట్టములో నున్నదేదియు వర్తించదు.

అయితే,ఈ ఉప-పరిచ్ఛేదము క్రింద అవినీతి ఆరోపణలకు, మానవహక్కుల ఉల్లంఘనకు, సంబంధించిన సమాచారమును మినహాయించరాదు.

అంతేకాక, మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించిన సమాచారమును కోరినపుడు, కేంద్ర సమాచార కమీషను ఆమోదము పొందిన తరువాత మాత్రమే ఆ సమాచారమును అందచేయవలెను మరియు 7వ పరిచ్ఛేదములో ఏమున్నప్పటికినీ, అందుకై అభ్యర్థన అందిన తేదీ నుండి నలభై అయిదు దినముల లోపల అట్టి సమాచారమును అందచేయవలెను.

(2) కేంద్ర ప్రభుత్వము, అధికార రాజపత్రములో అధిసూచన ద్వారా ఆ ప్రభుత్వముచే నెలకొల్పబడిన ఏదేని ఇతర రహస్య సమాచార లేదా భద్రతా వ్యవస్థను చేర్చుట ద్వారా గాని లేదా ఇదివరకే పేర్కొనబడిన ఏదేని వ్యవస్థను తొలగించుట ద్వారా గాని అనుసూచికి సవరణలు చేయవచ్చును మరియు అట్టి అధిసూచన ప్రచురించబడిన

మీదట అట్టి వ్యవస్థ ఈ అనుసూచిలో చేర్చబడినట్లు లేదా సందర్భానుసారముగా దాని నుండి తొలగించబడినట్లు భావించవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము(2) క్రింద జారీచేసిన ప్రతి అధిసూచనను పార్లమెంటు ఉభయ సదనముల సమక్షమందుంచవలెను.

(4) ఈ చట్టములో నున్నదేదియు రాజ్య ప్రభుత్వముచే స్థాపించబడి ఆ ప్రభుత్వముచే ఆయా సమయములందు అధిసూచిన ద్వారా అధికారిక రాజపత్రములో నిర్దిష్టపరచబడినట్టి రహస్య సమాచార మరియు భద్రతా వ్యవస్థలకు వర్తించదు:

అయితే ఈ ఉప-పరిచ్ఛేదము క్రింద అవినీతి ఆరోపణలకు మరియు మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సమాచారమును మినహాయించరాదు.

అంతేకాకుండా, మానవహక్కుల ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించిన సమాచారమును కోరినపుడు, రాజ్య సమాచార కమీషను ఆమోదమును పొంది తరువాత మాత్రమే ఆ సమాచారమును అందచేయవలెను మరియు 7వ పరిచ్ఛేదలో ఏమున్నప్పటికినీ అందుకై అభ్యర్థన అందిన తేదీ నుండి నలభై అయిదు దినముల లోపల అట్టి సమాచారమును అందచేయవలెను.

(5) ఉప-పరిచ్ఛేదము(4)క్రింద జారీచేసిన ప్రతి అధిసూచనను రాజ్యశాసన మండలి సమక్షమునందు ఉంచవలెను.

గమనించుట మరియు నివేదించుట.

25.(1) కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారము రాజ్య సమాచార కమీషను ఆచరణరీత్యా సాధ్యమయినంత త్వరలో ప్రతి సంవత్సరము చివరలో ఆ సంవత్సరములో ఈ చట్ట నిబంధనలు అమలుజరిగిన విషయములపై నివేదికను రూపొందించి దాని ప్రతిని సముచిత ప్రభుత్వమునకు పంపవలెను.

(2) ప్రతి మంత్రిత్వశాఖ లేదా విభాగము తమ అధికారిత పరిధిలోగల ప్రాధికార సంస్థల విషయములో ఈ పరిచ్ఛేదము క్రింద నివేదికను తయారుచేయుటకు అవసరమైన సమాచారమును సేకరించి కేంద్ర సమాచార కమీషనుకు లేదా సందర్భానుసారముగా రాజ్య సమాచార కమీషనుకు సమకూర్చవలెను మరియు ఈ పరిచ్ఛేదపు ప్రయోజనముల నిమిత్తము ఆ సమాచారమును సమర్పించుటకు సంబంధించి, రికార్డుల నిర్వహణకు సంబంధించి, అభ్యర్థనలను పాటించవలెను.

(3) నివేదిక ఏ సంవత్సరమునకు సంబంధించినదో ఆ సంవత్సరము నివేదికలో ఈక్రింది విషయములకు సంబంధించి సమాచారము పొందుపరచబడి ఉండవలెను;-

(ఎ) ప్రతి సార్వజనిక ప్రాధికారముకు వచ్చిన అభ్యర్థనల సంఖ్య;

(బి) ఈ చట్టము యొక్క నిబంధనల క్రింద పత్రములను పొందుటకు దరఖాస్తు దారులకు హక్కులేనప్పుడు తీసుకొన్న నిర్ణయముల సంఖ్య ఈ చట్టపు నిబంధనల క్రింద మరియు అట్టి నిబంధనలు ఎన్నిసార్లు ఉపయోగించు-కొనబడినవో ఆ సంఖ్య;

(సి) కేంద్ర సమాచార కమీషనుకు లేదా సందర్భానుసారము రాజ్య సమాచార కమీషనుకు పునర్విలోకనము కొరకు దాఖలు చేయబడిన అపీళ్ల సంఖ్య, అపీళ్ల స్వభావము మరియు అపీళ్ల ఫలితములు;

(డి) ఈ చట్టమును అమలుచేయు విషయములో ఎవరేని అధికారిపై తీసుకొన్న ఏదేని క్రమశిక్షణ చర్యకు సంబంధించిన వివరములు;

(ఇ) ఈ చట్టము క్రింద ప్రతి సార్వజనిక ప్రాధికారము వసూలు చేసిన ఛార్జీల మొత్తము;

(ఎఫ్) ఈ చట్టపు స్ఫూర్తిని మరియు ఉద్దేశ్యమును నెరవేర్చుటలో సార్వజనిక ప్రాధికారములు కృషిచేసి ఉన్నాయని సూచించు ఏవేని సంగతులు;

(జి) ఒక ప్రత్యేక సార్వజనిక ప్రాధికారముకు సంబంధించిన సిఫారసులతోసహా సంస్కరణలకు సంబంధించిన సిఫారసులు, ఈ చట్టము లేదా ఇతర శాసనము లేదా కామన్‌లా లేదా సమాచారము పొందు హక్కుకు సంబంధించిన ఏదేని ఇతర సంబంధిత విషయములో అభివృద్ధిపరచుటకు, మెరుగుపరచుటకు, ఆధునికమొనర్చుటకు సంస్కరణలు లేదా సవరణలు చేయుటకు సంబంధించిన సిఫారసులు.

(4) కేంద్ర ప్రభుత్వము లేదా సందర్భానుసారము రాజ్య ప్రభుత్వము ప్రతి సంవత్సరము చివరలో ఆచరణరీత్యా సాధ్యమయినంత వెంటనే, ఉప-పరిచ్ఛేదము (1)లో పేర్కొనబడిన కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారము రాజ్య సమాచార కమీషను యొక్క నివేదిక ప్రతిని పార్లమెంటు యొక్క ఉభయ సభలలోనూ లేదా సంద-ర్భానుసారముగా, రెండు సభలున్నప్పుడు రాజ్య శాసన మండలి యొక్క ఉభయ సభల-లోనూ, ఒకే సభవున్న యెడల రాజ్య శాసనసభ సమక్షములోనూ ఉంచునట్లు చూడవలెను.

(5) ఒక సార్వజనిక ప్రాధికారము ఈ చట్టము క్రింద కృత్యములను నిర్వహించుటలో చూపిన పనితీరు ఈ చట్టపు నిబంధనలకు లేదా స్ఫూర్తికి అనుగుణముగా లేదా కేంద్రసమాచార కమీషను లేదా సందర్భానుసారము రాజ్య సమాచార కమీషను అభిప్రాయపడినప్పుడు, అట్లు అనుగుణంగా ఉండేందుకుతీసుకోవాలని తాను అభిప్రాయ పడినట్టి చర్యలను నిర్దిష్టపరచుచూ సదరు ప్రాధికారమునకు సిఫారసులు చేయవచ్చును.

సముచిత ప్రభుత్వము కార్యక్రమములను రూపొందించుట.

26.(1) సముచిత ప్రభుత్వము, తనకు లభ్యంగావున్న ఆర్థిక మరియు ఇతర వనరులను దృష్టిలోవుంచుకొని,-

(ఎ) ఈ చట్టము క్రింద ప్రతిపాదించిన హక్కులను ఎలా వినియోగించుకోవాలో ప్రజలు, ముఖ్యంగా అణగారిన సమాజముల ప్రజలు, అవగాహన చేసుకోవడానికి సంబంధించి ఉపయోగకరమగు విద్యాసంబంధ కార్యక్రమాలను అభివృద్ధిపరచి అమలుపరచవచ్చును;

(బి) ఖండము (ఎ)లో పేర్కొనబడిన కార్యక్రమాల అభివృద్ధి మరియు అమలులో అట్టి కార్యక్రమాలను తమంతతామే చేపట్టునట్లు సార్వజనిక ప్రాధికారములను ప్రోత్సహించ వచ్చును;

(సి) సార్వజనిక ప్రాధికారములు తమ కార్యకలాపాలకు సంబంధించి ఖచ్చితమైన సమాచారమును సకాలములోనూ మరియు సమర్థవంతముగానూ వ్యాప్తి చేయునట్లు చూడవచ్చును; మరియు

(డి) సార్వజనిక ప్రాధికారములలోని కేంద్ర పౌర సమాచార అధికారులకు లేదా సందర్భానుసారము రాజ్య పౌర సమాచార అధికారులకు తగు శిక్షణను కల్పించవచ్చును మరియు వారు వినియోగించుకొనుటకు సంబంధిత శిక్షణా వస్తు సామగ్రిని వారికి అందచేయవచ్చును.

(2) సముచిత ప్రభుత్వము, ఈ చట్టము ప్రారంభమయిన తేదీ నుండి పదునెనిమిది (18) నెలలలోపల తన అధికార భాషలో ఈ చట్టము క్రింద నిర్దిష్టపరచిన ఏదేని హక్కును వినియోగించుకొనదలచు వ్యక్తికి తేలికగా అర్థమయ్యే రీతిలో అవసరమైన సమాచారమును సులభమైన, సమగ్రమైన ప్రరూపములో మరియు రీతిలో పొందుపరచిన గైడును రూపొందించవలెను.

(3) సముచిత ప్రభుత్వము, ఉప-పరిచ్ఛేదము (2)లో పేర్కొనబడిన మార్గదర్శకాలను అవసరమయినచో ఎప్పటికప్పుడు ఆధునికపరచి ఎప్పటికప్పుడు ప్రచురించవలెను మరియు అందులో ముఖ్యంగా ఉప-పరిచ్ఛేదము (2)లోని సాధారణతకు భంగం కలుగకుండా ఈ క్రింది విషయములు చేరివుండవలెను, -

(ఎ) ఈ చట్టము ఉద్దేశములు;

(బి) 5వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)క్రింద నియమించబడిన ప్రతి సార్వజనిక ప్రాధికారము యొక్క కేంద్ర ప్రజా సమాచార అధికారి లేదా సందర్భానుసారము రాజ్య ప్రజాసమాచార అధికారియొక్క పోస్టల్ మరియు వీధిచిరునామా, ఫోన్ మరియు ఫ్యాక్స్ నెంబరు, ఉంటే అతని ఎలక్ట్రానిక్ మెయిల్ చిరునామా;

(సి) కేంద్ర ప్రజా సమాచార అధికారికి లేదా సందర్భానుసారము రాజ్య ప్రజా సమాచార అధికారికి సమాచారమును పొందుటకు అభ్యర్థన సమర్పించవలసిన రీతి మరియు దాని ప్రరూపము;

(డి) ఈ చట్టము క్రింద సార్వజనిక ప్రాధికారము యొక్క కేంద్ర పౌర సమాచార అధికారి లేదా సందర్భానుసారము రాజ్య పౌర సమాచార అధికారి నుండి లభ్యమగు సహాయము మరియు ఆయా అధికారుల విధులు;

(ఇ) కేంద్ర సమాచార కమీషను లేదా సందర్భానుసారము రాజ్య సమాచార కమీషను నుండి లభ్యమగు సహాయము;

(ఎఫ్) ఈ చట్టము ద్వారా ఒసగబడిన హక్కు మరియు విధించబడిన బాధ్యత విషయములో తీసుకొన్న చర్య లేదా చర్య తీసుకొనకపోవటానికి సంబంధించి శాసనములో లభ్యమగు ప్రత్యుపాయములు మరియు కమీషనుకు అపీలు చేసుకొను పద్ధతి;

(జి) 4వ పరిచ్ఛేదము ననుసరించి వివిధ విభాగాల రికార్డులను స్వచ్ఛందముగా వెల్లడి చేయడానికి సంబంధించిన నిబంధనలు;

(హెచ్) సమాచారమును పొందుటకొరకు చేయు అభ్యర్థనల విషయములో చెల్లించవలసిన ఫీజులకు సంబంధించిన నోటీసులు;

(ఐ) ఈ చట్టము ననుసరించి సమాచారమును పొందుటకు సంబంధించి చేసిన లేదా జారీచేసిన ఏవేని అదనపు వినియమములు లేదా సర్క్యులర్లు;

(4) సముచిత ప్రభుత్వము అవసరమైనచో, ఈ మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు సవరించి ప్రచురించవలెను.

సముచిత ప్రభుత్వమునకు నియమములు చేయు అధికారము.

27.(1) సముచిత ప్రభుత్వము, అధికారిక గెజెటులో అధిసూచన ద్వారా ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటకు నియమములను చేయవచ్చును.

(2) ప్రత్యేకించియు, పై అధికారము యొక్క వ్యాపకతకు భంగము కలుగకుండాను, అట్టి నియమములలో ఈ క్రింది అన్ని లేక వాటిలో ఏవేని విషయముల కొరకు నిబంధనలు చేయవచ్చును, అవేవనగా:-

(ఎ) 4వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము(4) క్రింద వ్యాప్తి చేయవలసివున్న మాధ్యమము యొక్క ధర లేదా ఆయా వస్తు సామగ్రి యొక్క ముద్రణ ధర;

(బి) 6వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)క్రింద చెల్లించదగిన ఫీజు;

(సి) 7వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదములు(1) మరియు (5)ల క్రింద చెల్లించదగిన ఫీజు;

(డి) 13వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (6) మరియు 16వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (6) క్రింద అధికారుల మరియు ఇతర ఉద్యోగులకు చెల్లించవలసిన జీతభత్యములు మరియు వారి సేవా నిబంధనలు మరియు షరతులు;

(ఇ) 19వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (10) క్రింద అపీళ్లను నిర్ణయించుటలో కేంద్రసమాచార కమీషను లేదా సందర్భానుసారము రాజ్యసమాచార కమీషను అనుసరించవలసిన కార్య ప్రక్రియ; మరియు

(ఎఫ్) విహితపరచవలసిన లేక విహితపరచదగు ఏదేని ఇతర విషయము.

సమర్థ ప్రాధికారిచే నియమములు చేయుటకు అధికారము.

28.(1) సమర్థ ప్రాధికారి, అధికారిక గెజెటులో అధిసూచన ద్వారా ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటకు నియమములు చేయవచ్చును.

(2) ప్రత్యేకించియు, పై అధికారముల వ్యాపకతకు భంగము కలగకుండాను అట్టి నియమములలో ఈక్రింది అన్ని లేక ఏవేని విషయముల కొరకు నిబంధనలు చేయవచ్చును, అవేవనగా:-

(i) 4వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము(4) క్రింద వ్యాప్తి చేయవలసి వున్న మాధ్యమము యొక్క ధర లేదా ఆయా వస్తు సామగ్రి యొక్క ముద్రణ ధర;

(ii) 6వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము(1) క్రింద చెల్లించదగిన ఫీజు;

(iii) 7వ పరిచ్ఛేపు ఉప-పరిచ్ఛేదము (1)క్రింద చెల్లించదగిన ఫీజు; మరియు

(iv) విహితపరచవలసిన లేక విహితపరచదగు ఏదేని ఇతర విషయము;

నియమములను పార్లమెంటు సమక్షమున ఉంచుట.

29.(1) ఈ చట్టము క్రింద కేంద్ర ప్రభుత్వముచే చేయబడిన ప్రతి నియమమును దానిని చేసిన వెంటనే వీలైనంత త్వరగా పార్లమెంటు అధివేశనములోనున్నప్పుడు మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను, అట్టి కాలావధి ఒకే అధివేశనములో గాని వరుసగా వచ్చు రెండు లేక అంతకు ఎక్కువ అధివేశనములలో గాని చేరియుండవచ్చును. పైన చెప్పినట్టి అధివేశనమునకు, లేక వరుసగా వచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు పూర్వము ఉభయ సదనములు ఆ నియమములో ఏదేని మార్పుచేయుటకు అంగీకరించినచో లేక ఉభయ సదనములు ఆ నియమము చేయరాదని అంగీకరించినచో అటు పిమ్మట ఆ నియమము, అట్లు మార్పుచేసిన రూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును. లేక సందర్భానుసారముగా ఎట్టి ప్రభావము కలిగియుండదు, అయినప్పటికిని అట్టి ఏదేని మార్పుగాని లేక రద్దుగాని, అంతకుపూర్వము, ఆ నియమము క్రింద చేసియుండినదేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

(2) రాజ్య ప్రభుత్వముచే ఈ చట్టము క్రింద చేయబడిన ప్రతి నియమము దానిని అధిసూచించిన పిమ్మట వీలైనంతత్వరగా రాజ్య శాసనమండలి సమక్షమున ఉంచవలెను.

ఇబ్బందులను తొలగించు అధికారము.

30.(1) ఈ చట్టపు నిబంధనలను అమలుచేయుటలో ఏదేని ఇబ్బంది ఏర్పడినచో, కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో ఉత్తరువును ప్రచురించుట ద్వారా ఆ ఇబ్బందిని తొలగించుటకు ఆవశ్యకము లేక ఉపయుక్తమని భావించునట్లుగా ఈచట్ట ప్రయోజనములకు అసంగతముకానట్టి నిబంధనలను చేయవచ్చును.

అయితే, ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి రెండు సంవత్సరముల కాలావధి ముగిసిన తరువాత అట్టి ఉత్తరువు ఏదియు చేయబడరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేసిన ప్రతి ఉత్తరువు దానిని చేసిన పిమ్మట వీలైనంత త్వరగా పార్లమెంటు ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను.

2003లోని 5వ చట్టము రద్దు.

31. సమాచార స్వేచ్ఛ చట్టము,2002 ఇందుమూలముగా రద్దు చేయబడింది.

మొదటి అనుసూచి

(13(3) మరియు 16 (3) పరిచ్ఛేదములను చూడుము)

ప్రధాన సమాచార కమీషనరు/సమాచార కమీషనరు/రాజ్య ప్రధాన సమాచార కమీషనరు/ రాజ్య సమాచార కమీషనరుచే చేయబడు ప్రమాణము లేదా ప్రతిజ్ఞ ప్రరూపము.

"ప్రధాన సమాచార కమీషనరు/సమాచార కమీషనరు/రాజ్య ప్రధాన సమాచార కమీషనరు/రాజ్య సమాచార కమీషనరుగా నియమించబడిన .... అను నేను, శాసనము ద్వారా స్థాపితమైయున్న భారత సంవిధానము యెడ యధార్థ శ్రద్ధా నిష్ఠలను కలిగి వుందుననియు మరియు భారతదేశ సార్వభౌమత్వమును మరియు అఖండతను సమర్థింతుననియు మరియు ఎలాంటి భయము లేదా పక్షపాతము, అభిమానము లేదా దురభిమానము లేకుండా నా పదవీ బాధ్యతలను నా శక్తి సామర్థ్యాలు, విజ్ఞాన, విచక్షణలతో నిర్వర్తించుదుననియు మరియు సంవిధానమును, శాసనములను పరిరక్షిస్తానని దైవ సాక్షిగా ప్రమాణము చేయుచున్నాను/సత్యనిష్ఠతో ప్రతిజ్ఞ చేయుచున్నాను.".

రెండవ అనుసూచి

(24వ పరిచ్ఛేదము చూడుడు)

కేంద్ర ప్రభుత్వముచే స్థాపించబడిన రహస్య సమాచార మరియు భద్రతా సంస్థలు.

1. రహస్య సమాచార బ్యూరో.
2. మంత్రి మండలి సచివాలయమునకు చెందిన పరిశోధన మరియు విశ్లేషణ విభాగము.
3. రెవిన్యూ రహస్య సమాచార డైరెక్టరేట్.
4. కేంద్ర ఆర్థిక రహస్య సమాచార బ్యూరో.
5. అమలు డైరెక్టరేట్.
6. మాదకద్రవ్య నియంత్రణా బ్యూరో.
7. వైమానిక పరిశోధన కేంద్రము.
8. ప్రత్యేక సరిహద్దు బలగము.
9. సరిహద్దు భద్రతా బలగము.
10. కేంద్ర రిజర్వు పోలీసు బలగము.
11. ఇండో-టిబెట్ సరిహద్దు పోలీసు.
12. కేంద్ర పారిశ్రామిక భద్రతా బలగము.
13. జాతీయ భద్రతా గార్డులు.
14. అస్సామ్ రైఫిళ్లు.
15. సశస్త్ర సీమా బల్.
16. (సి.ఐ.డి) ప్రత్యేక బ్రాంచి/శాఖ, అండమాన్ మరియు నికోబార్.
17. (సి.ఐ.డి) నేర విభాగము, సి.బి.దాద్రా మరియు నాగర్ హవేలి.
18. ప్రత్యేక బ్రాంచి/శాఖ, లక్షద్వీప్ పోలీసు.
19. ప్రత్యేక రక్షణ గ్రూపు.
20. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ.
21. సరిహద్దు రోడ్ల అభివృద్ధి మండలి.
22. ఆర్థిక విషయాలలో రహస్య సమాచార సేకరణ విభాగము, ఇండియా.